

22ND ANNIVERSARY

# నేటిధాత్రి®

తెలుగు వార్త పత్రిక




ఆదివారం 24-05-2026 పేజీలు : 12 CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES సంపుటి : 22 సంచిక : 51 రూ॥ 6.00







# సామాజిక బాధ్యతలో..

## ఊరికి స్వచ్ఛ సేవలో

# కట్టా!

## ప్రతి ఇల్లు నిండుగా.. పల్లెకు పండుగ



**కట్టా రాకతో కదిలిన కమలాపూర్!**



## పర్యావరణ పరిరక్షణ, పారిశుధ్య ప్రణాళిక కరదీపిక

- ఊరికోసం మన మందరం కదులుదాం.. ఊరుపేరు నిలబెడదాం.
- ఉత్సాహంగా సాగిన పారిశుధ్య పరిరక్షణ.
- మన ఊరు.. మన బాధ్యత ఒక వినూత్న యజ్ఞం.
- మన ఊరు.. మన బాధ్యత లో భాగంగా కట్టా శ్రమ దానం.
- సర్పంచ్ చేస్తున్న స్వచ్ఛ కమలాపూర్ కు కట్టా చేయూత.
- కన్నతల్లి, పుట్టిన ఊరు అన్నిటికన్నా గొప్పది.
- ఇల్లు ఎంత శుభ్రంగా వుంటుందో ఊరు కూడా అంతే సుందరంగా వుండాలి.
- ఊరు కోసం ఒక్క రోజు శ్రమ దానం ఎంతో ఆదర్శం.
- ప్రతి ఊరు కమలాపూర్ లా కదిలితే దేశమంతా సౌభాగ్యం.
- ప్రతి కుటుంబం ఆరోగ్యం.. ప్రతి ఊరు నందన వనం.
- ఆరోగ్యమే మహాభాగ్యము.. ఊరు స్వచ్ఛతే సుందర వనము.
- కట్టాతో కలిసి సాగిన శ్రమ దానం..స్వచ్ఛతకు శ్రీకారం.
- కమలాపూర్ లో కదిలిన యువత.. ఊరు భావితకు సరికొత్త బాట.
- ఈ యజ్ఞం ఆగకూడదు.. వారానికి ఒక్క సారి సాగినా ఊరికి జ్వరం కూడా రాదు.









- ఊరు చల్లగా వుంటే.. ఊరంతా పండగ చేసుకుంటుంది.
- ఊరు పచ్చగా వుంటే.. అందరికీ ఆరోగ్యం పంచుతుంది.
- ఊరు కళకళ లాడితే జీవితాలు కిలకిల రావాలవుతాయి.

హైదరాబాద్, నేటిధాత్రి:

ఆ ఊరు కట్టా ఓసారి రావా అనిపిలించి. నీ ఊరికి ఏదైనా సేవ చేయవా? అని పిలిచింది. తాతల నాడు ఆ ఊరికి చేసిన సేవలు ఇంకా గుర్తున్నాయని గుర్తు చేసింది. కన్న తల్లి మీద ప్రేమ, పుట్టిన ఊరి మీద మమకారం బతికున్నంత కాలం ఎవరికీ పోదు. అందుకే కమలాపూర్‌కు కట్టా కుటుంబానికి ప్రత్యేకమైన అనుబందం వుంది. ఆ కుటుంబం తాతల నాడు ఆ ఊరి చెరువును నిర్మాణం చేశారు. చెరువుకు ప్రాణం పోశారు. ఊరికి నీటి కష్టం రాకుండా పెద్ద ఎత్తున కట్ట నిర్మాణం చేశారు. తరతరాలకు ఊరికి కల్పతరువుగా మార్చారు. ఆ చెరువు ఆ ఊరికి ఆదెవరుగా మారింది. కొన్ని కుటుంబాలకు ఆ చెరువు ఆదారమైంది. ఆదాయం ఇస్తుంది. ఊరి సాగుకు నీటిని అందిస్తుంది. ఆ ఊరు కట్టా కుటుంబాన్ని ఇంకా గుర్తు పెట్టుకుంది. ఆనాటి ఆనవాలుతో కట్టా కుటుంబానికి ప్రత్యేక స్ధానం ఏర్పడింది. అప్పటి నుంచి కట్టా కుటుంబం అంటే ఊరుతో మరింత మమకారం పెరిగింది. తరాలు గడిచినా, ఊరు వదలి ఆ కుటుంబాలు ఇతర ప్రాంతాలకు వెళ్లినా, ఊరును వాళ్లు మర్చిపోలేదు. ఊరిలో వారికి ఆనవాలును వదులుకోలేదు. అందుకే సమయం చిక్కినప్పుడల్లా ఊరును చూసి వస్తుంటారు. ఊరి బాగోగులు తెలుసుకుంటారు. ఊరి కోసం తమ శక్తికి మేరకు మేలు చేసి పెడుతుంటారు. ఆ పరంపర కొనసాగింపులో భాగంగా కమలాపూర్ సర్పంచ్ పబ్బ సతీష్, ఫోన్ చేసి కట్టా రాఘవేంద్రరావును ఓసారి ఊరికి రమన్నారు. మన ఊరు..మన భాద్యత పేరుతో నెలలో రెండు శనివారాలు స్వచ్ఛ కమలాపూర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. దాంతో వెంటనే స్పందించిన నేటి ధాత్రి దినపత్రికి ఎడిటర్, ధాత్రి గ్రూప్స్ చైర్మన్ కట్టా రాఘవేంద్రరావు, ఆయన కుమారుడు నేటిదాత్రి డిజిటల్ డైరక్టర్‌తో కలిసి కమలా పూర్‌కు వస్తామని మాటిచ్చారు. అన్నట్లుగానే శనివారం కమలా పూర్ చేరుకున్నారు. ఊరంతా కట్టా రాఘవేంద్రరావును ఘనంగా స్వాగతం పలికింది. స్వచ్ఛ కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా కట్టా రాఘవేంద్ర రావు ఊరి ప్రజలనేద్ధేశించి మాట్లాడారు. ఊరితో తమకు వున్న అనుబందాన్ని గుర్తు చేశారు. ఊరి కోసం తమ తాతలు చేసి సేవలను కొనియాడారు. సామాజిక బాద్యత అనేది తమ తాతల కాలం నుంచి వస్తుందని చెప్పారు. ఊరికోసం ఆ కాలంలోనే ఎంతో చేసిన తమ కుటుంబం, ఇప్పటికీ ఏదైనా చేయాలన్న తపన ఎప్పుడూ వుంటుందన్నారు. అందుకే సర్పంచ్ పబ్బ సతీష్ కోరికను అంగీకరించారు. పర్యావరణ పరిరక్షణ కోసం తమ కుటుంబం ఆ కాలంలోనే ఊరి కోసం ఎంతో చేసిందన్నారు. కమలాపూర్ అందమైన ప్రపంచం. అది ఎప్పుడూ కళకళలాడాలని మనసారా కోరుకుంటున్నానని చెప్పారు. ఊరికోసం ఇక నుంచి మనందరం కదులుదాం..ఊరి పేరు నిలబెడదాం అని యువతకు సూచించారు. ఊరంతా పచ్చగా వుండాలి. పరిశుభ్రంగా వుండాలి. పచ్చదనం వెల్లివిరియాలి. పాడి పంటలతో ఊరు సౌభాగ్యంగా వెలుగొందాలని కట్టా రాఘవేంద్రరావు సూచించారు. ముఖ్యంగా యువత తమకు వున్న సమయంలో ఒక రోజు రెండు మూడు గంటలు కేటాయిస్తే చాలు. ఊరంతా నందనవనంగా మారిపోతుందని అన్నారు. కమలాపూర్ తెలంగాణకే కాదు, దేశానికే ఆదర్శం కావాలని కోరారు. అందుకు ఊరి పెద్దలు, యువకులు తోడ్పాటునందించాలన్నారు. కేవలం కొంత సమయం ఊరి కోసం వెచ్చిస్తే చాలు అన్నారు. ఊరంతా తల్చుకుంటే కమలాపూర్ సుందరవనంగా వెలుగొండం పెద్ద సమస్య కాదు. అందరం శ్రమ దానం చేస్తే ఊరు సుందరమయం చేయడం పెద్ద సమస్య కాదు. అయితే అందరిలోనూ అంకితభావం వుండాలి. ప్రభుత్వమే అన్ని చేయాలని అనుకోకూడదు. దేశం మనకేమిచ్చిందని అనుకోవడం కన్నా, మనం దేశానికి ఏమిస్తున్నాన్నదే ఎంతో ముఖ్యమని గుర్తు చేశారు. మన ఇల్లు ఎంతో శుభ్రంగా వుండాలని కోరుకుంటాం. రోజుకు రెండు సార్లైనా సరే శుభ్రం చేసుకుంటాం. అలాగే మన ఊరు కూడా శుభ్రంగా వుంటే మనం ఆరోగ్యంగా వుంటాం. ఈ రోజు నేను ఊరి ప్రజల్లో చూసిన ఉత్సాహం ఎప్పుడూ మర్చిపోను. తనకు సాదర స్వాగతం పలకడంతోపాటు, మీతోపాటు కలసి ఊరికోసం శ్రమ దానం చేసే అవకాశం రావడం కూడా ఎంతో ఆనందాన్ని అందించింది. ఊరి కోసం చేసే చిన్న శ్రమ దానంలో ఇంత ఆత్మ సంతృప్తి వుందా? అని కూడా మనసు పులకరించింది. మన కోసం గ్రామం పారిశుద్య పనులు నిర్వహించే వాళ్లు ఎంత కష్టపడుతున్నారో ఒక్క పూటలో మనందరికీ అర్ధమౌతోంది. నిత్యం వాళ్లు ఊరి కోసం పడుతున్న శ్రమలో ఒక్క పూట సహకరిస్తే వారిని మనం ఎంతో గౌరవించినట్లౌవుతుంది. వారి సేవలు ఎంతో గొప్పవి. అవి అందరం చేయలేం. నిజం చెప్పాలంటే పారిశుద్య పనులు అనేవి ఉపాది కాదు. ఊరికి వాళ్లు చేసే సేవకు నిదర్శనమని చెప్పుకోవాలి. గ్రామ సర్పంచ్ సతీష్ తీసుకున్న ఇలాంటి వినూత్నమైన యజ్ఞం నిరంతరం కొనసాగాలి. అందుకు మాతోపాటు, ఊరంతా సహకరించాలి. ఊరంతా కదలాలి. అప్పుడు ఊరు పాలవెల్లిలా మెరిపోతుంది. ఆర్యోగానికి ఆర్యోగ్యం..ఆనందానికి ఆనందం మిగులుతుంది. మన ఊరు దేశానికి ఆదర్శమౌతుంది. కట్టా రాఘవేంద్రరావు కమలాపూర్ చేరుకోగానే గ్రామ ప్రజలు ఎంతో ఆదరంగా పలకరించారు. ఆయన స్వయంగా పారిశుధ్య పనులు నిర్వహిస్తుంటే ప్రజలు ఎంతో ఆసక్తిగా గమనించారు. ఊరి మీద ఎంత ప్రేమ వుంటే ఇలా పాలు పంచుకోగలరు అని ప్రజలు అనుకున్నారు. కట్టా రాఘవేంద్రరావుతోపాటు, ఆయన కుమారుడు మలి తరం నుంచి కట్టా శివసుబ్రహ్మణ్యం కూడా అలుపు లేకుండా వీధులు శుభ్రం చేస్తుంటే ప్రజలు ఆసక్తిగా గమనించారు. సామాజిక సేవ అనేది వారి రక్తంలోనే వుందని అనుకున్నారు. మొత్తానికి ఊరు మెచ్చేలా, పిలిచినందుకు సంతోషించేలా సేవలను అందించి శబాష్ అనిపించుకున్నారు. ఇలాగే సమయం దొరికనప్పుడు ఊరికి వచ్చి వెళ్లాలని కోరారు.

## ఇంటర్ ర్యాంకర్ కోరం వైష్ణవికి, కట్టా శివసుబ్రహ్మణ్యం రూ. 5వేల ఆర్ధిక సాయం.



కమలాపూర్ గ్రామానికి చెందిన పేద విద్యార్ధిని కోరం వైష్ణవి ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో 470 మార్కులకు గాను 468 మార్కులు సాధించి రాష్ట్రంలోనే నెంబర్ టూ ర్యాంక్‌ను సంపాదించు కున్నది. పేద కుటుంబంలో వికసించిన చదువల సరస్వతి వైష్ణవి. ఆమె చదువకు పేదరికం అడ్డు కాకూడదన్న ఆలోచనతో నేటిధాత్రి డిజిటల్ డైరెక్టర్ కట్టా శివసుబ్రహ్మణ్యం వైష్ణవికి రూ. 5 నగదు ప్రోత్సాహం అందించారు. వైష్ణవి మరిన్ని ఉన్నత చదువులు చదువుకోవాలని ఆకాంక్షించారు. పేదరికం వల్ల చదువు ఆగిపోకూడదన్నారు. చదువులో ఎంతో ప్రతిభ కనబర్చిన విద్యార్ధులెందరికో కట్టా రాఘవేంద్రరావు ఆర్ధిక చేయూతనందిస్తూ వుంటారు. అలా కమలాపూర్‌లో పేదవిద్యార్ధి గురించి తెలిసి వెంటనే వైష్ణవికి ఆర్ధిక చేయూతనందించారు. కట్టా కుటుంబం సామాజిక సేవకు గ్రామ ప్రజలు ఎంతో సంతోషించారు. పేదవిద్యార్ధికి సాయం చేయడాన్ని గ్రామస్థులు అభినందించారు.



నిష్పక్షపాత వార్తల నిజదర్పణం

22ND ANNIVERSARY

# నేటిధాత్రి ®

తెలుగు వార్త పత్రిక



ఆదివారం 24-05-2026 పేజీలు : 12 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 51 రూ॥ 6.00






# యాదాద్రిలో అభివృద్ధి పనులు

## రూ.100 కోట్ల పనులకు సీఎం శ్రీకారం..

## రూ.43.80 కోట్లతో వేద పాఠశాలకు భూమిపూజ





**శంకుస్థాపనల వివరాలు:**

- రూ.43.80 కోట్లతో వేద పాఠశాలకు శంకుస్థాపన
- రూ.9.87 కోట్లతో కొండపై స్వామివారి నిత్య కల్యాణ మండపం నిర్మాణానికి శంకుస్థాపన
- రూ.1.41 కోట్లతో వైకుంఠ ద్వారం నుంచి కొండపైకి వెళ్లే మెట్ల మార్గానికి పై కప్పు నిర్మాణానికి శంకుస్థాపన
- రూ.1.35 కోట్లతో రథశాల వైపు మాడవీధులకు మెట్ల నిర్మాణానికి శంకుస్థాపన
- రూ.43.12 కోట్లతో డార్మిటరీ హాల్స్, దీక్షాపరుల సదనం నిర్మాణానికి శంకుస్థాపన.

- వేద పాఠశాలతో ఆధ్యాత్మిక వైభవానికి కొత్త ఊపు
- శ్రీలక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్న సీఎం రేవంత్
- కంచి కామకోటి పీఠాధిపతి సమక్షంలో వేదపాఠశాల కార్యక్రమం
- భక్తులకు మెరుగైన సౌకర్యాలే లక్ష్యంగా కొత్త ప్రాజెక్టులు
- నిత్య కల్యాణ మండపం, డార్మిటరీ హాల్స్‌కు గ్రీన్ సిగ్నల్
- వచ్చే రెండేళ్లలో వేద పాఠశాల నిర్మాణం పూర్తి చేసే లక్ష్యం
- యాదాద్రిని దేశంలో ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు

యాదగిరిగుట్ట, నేటిధాత్రి:
యాదగిరిగుట్టలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా ఆలయ అభివృద్ధి పనులకు భారీ ఊతం లభించింది. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా సుమారు రూ.100 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. ఇందులో వేద పాఠశాల నిర్మాణం, నిత్య కల్యాణ మండపం, మెట్ల మార్గానికి కప్పు, డార్మిటరీ హాల్స్, దీక్షాపరుల సదన్ వంటి పనులు ఉన్నాయి. శనివారం ఉదయం ప్రత్యేక హెలికాప్టర్‌లో యాదగిరిగుట్ట పెద్దగుట్టపైకి చేరుకున్న సీఎం రేవంత్‌రెడ్డికి ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఘన స్వాగతం పలికారు. అనంతరం ముఖ్యమంత్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

సీఎంతో పాటు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, ఎంపీ వేంనరేందర్‌రెడ్డి తదితరులు యాదాద్రి కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి సమక్షంలో వేద పాఠశాలకు భూమిపూజ నిర్వహించారు. రూ.43.80 కోట్ల వ్యయంతో ఈ వేద పాఠశాల నిర్మించనున్నారు. యాదాద్రి ఆలయ నగరి లేఅవుట్ సమీపంలో సుమారు 15 ఎకరాల విస్తీర్ణంలో ఈ నిర్మాణం చేపట్టనున్నారు. తెలంగాణలోనే అతిపెద్ద వేద విద్యా సంస్థగా దీనిని అభివృద్ధి చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. వచ్చే రెండేళ్లలో నిర్మాణం పూర్తి చేసి తరగతులు ప్రారంభించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు.

ఈ వేద పాఠశాలలో ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వవేదంతో పాటు ఆగమ శాస్త్రాలు, ఆలయ పూజా విధానాలకు సంబంధించిన శిక్షణ కూడా అందించనున్నారు. పూర్తిస్థాయి వసతి సౌకర్యాలతో విద్యార్థులకు నివాస సదుపాయాలు కల్పించనున్నారు.

అదేవిధంగా రూ.9.87 కోట్లతో కొండపై స్వామివారి నిత్య కల్యాణ మండపం నిర్మాణానికి, రూ.1.41 కోట్లతో వైకుంఠ ద్వారం నుంచి కొండపైకి వెళ్లే మెట్ల మార్గంపై కప్పు నిర్మాణానికి, రూ.1.35 కోట్లతో రథశాల వైపు మాడవీధులకు మెట్ల నిర్మాణానికి, రూ.43.12 కోట్లతో డార్మిటరీ హాల్స్, దీక్షాపరుల సదన్ నిర్మాణాలకు సీఎం శంకుస్థాపన చేశారు. భక్తులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా ఈ పనులు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. వేసవి, వర్షాకాలాల్లో భక్తులు మెట్ల మార్గంలో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో మెట్ల మార్గానికి కప్పు నిర్మాణం చేపట్టడం ప్రాధాన్యత సంతరించుకుంది. దీంతో భక్తులకు ఉపశమనం కలుగుతుందని భావిస్తున్నారు. కార్యక్రమం అనంతరం ముఖ్యమంత్రి మరోసారి ఆలయ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించినట్లు సమాచారం. యాదాద్రిని దేశంలోని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా మరింత అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

## దేశాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్న ఎండల తీవ్రత

- భానుడి భగభగలతో బయటకు రావాలంటేనే భయపడుతున్న ప్రజలు
- వారం రోజుల పాటు తీవ్ర వడగాలుల హెచ్చరిక
- పలు రాష్ట్రాలకు ఐఎండీ అలర్ట్



న్యూఢిల్లీ, నేటిధాత్రి:
దేశవ్యాప్తంగా భానుడు తన ఉగ్రరూపం చూపిస్తున్నాడు. చాలా ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది గంటల నుంచే ఎండలు భగభగ మండుతున్నాయి. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు అడుగు పెట్టాలంటేనే భయపడుతున్నారు. అత్యవసర పనులు ఉంటే తప్ప ఎక్కువ మంది ఇళ్లకే పరిమితం అవుతున్నారు.

రానున్న వారం రోజుల పాటు కూడా దేశంలోని పలు ప్రాంతాల్లో తీవ్రమైన వడగాలులు వీచే

12లో




## తెలంగాణలో ఎండలపై హై అలర్ట్

- వడదెబ్బతో 16 మంది మృతి.. కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా
- వచ్చే మూడు రోజులు మరింత తీవ్ర హీట్‌వేవ్ హెచ్చరిక
- పరిస్థితిపై అధికారులతో మంత్రి పొంగులేటి అత్యవసర సమీక్ష

హైదరాబాద్, నేటిధాత్రి:
రాష్ట్రవ్యాప్తంగా హీట్‌వేవ్ పరిస్థితులపై హై అలర్ట్ ప్రకటించినట్లు తెలంగాణ రెవెన్యూ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. తీవ్ర ఉష్ణోగ్రతల పరిస్థితులపై మంత్రి

12లో



## యువతకు మంచి భవిష్యత్తు ఇవ్వొద్దా..

- ఫ్యూచర్ సిటీపై రాజకీయం ఎందుకు?
- అభివృద్ధి అడ్డుకుంటే రాష్ట్రానికి నష్టం
- యువత భవిష్యత్తుపై రాజకీయాలు వద్దు
- ఓటమి షాక్ నుంచి బీఆరెస్ బయటపడలేదా?
- బీఆర్ఎస్‌పై మంత్రి శ్రీధర్ బాబు ఫైర్

హైదరాబాద్, నేటిధాత్రి:
బీఆర్ఎస్ పార్టీ నేతలపై మంత్రి శ్రీధర్ బాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు చీప్ పాలిటిక్స్.. బ్లాక్ మెయిల్ పాలిటిక్స్ చేయొద్దని అన్నారు. శనివారం మీడియాతో

12లో

## యువశక్తితో వికసిత భారత్




- ఉద్యోగాలు, నైపుణ్యాభివృద్ధితో యువతకు కొత్త అవకాశాలు
- యువతే వికసిత భారతానికి సూపర్ హీరోలు
- రోజ్‌గార్ మేళాతో లక్షల ఉద్యోగాలు
- ఉద్యోగాల నుంచి ఉపాధి సృష్టి దిశగా యువత
- భవిష్యత్ భారత్ నిర్మాణంలో యువతకు కీలక స్థానం : కిషన్ రెడ్డి

హైదరాబాద్, నేటిధాత్రి:
దేశవ్యాప్తంగా 47 ప్రాంతాల్లో జరిగిన రోజ్‌గార్ మేళాలో 51 వేల మందికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. శనివారం నాడు బోయిగూడలోని రైల్ కళారంగ్‌లో జరిగిన 19వ రోజ్‌గార్ మేళాలో కేంద్ర మంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈరోజు 220 మంది కొత్తగా ఉద్యోగాల్లో చేరుతున్నారన్నారు. 2022లో

12లో




## పెద్ది రిలీజ్‌కు పర్సంటేజ్ కండీషన్!

-పర్సంటేజ్ విధానం లేకుంటే విడుదలకు సహకారం లేదన్న అసోసియేషన్





- 'పెద్ది' విడుదలకు కొత్త షరతు
- పర్సంటేజ్‌పైనే ఎగ్జిబిటర్ల పట్టుదల
- థియేటర్ల సంక్షోభం.. నిర్మాతలపై ఒత్తిడి
- రెంటల్ వద్దు.. వాటాలో వాటా కావాలి ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ కీలక నిర్ణయం

హైదరాబాద్, నేటిధాత్రి:
తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. పెద్ది సినిమా విడుదల చేయాలంటే తమకు

12లో

## చిన్నారుల అదృశ్యాలపై సుప్రీం తీవ్ర ఆందోళన

- మిస్సింగ్ కేసులు కాదు.. కిడ్నాప్ కోణంలో దర్యాప్తు చేయాలి
- దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు కీలక ఆదేశాలు
- మానవ అక్రమ రవాణా ముఠాలపై ఉక్కుపాదం మోపాలని సూచన



న్యూఢిల్లీ, నేటిధాత్రి:
దేశవ్యాప్తంగా నానాటికీ పెరుగుతున్న చిన్నారుల అదృశ్యం కేసులపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రస్తుతం దేశంలో దాదాపు 47,000 మంది చిన్నారుల ఆచూకీ లభించకుండా పోయిందని, ప్రతి ఏటా ఈ బ్యాక్‌లాగ్ పెరుగుతుండటంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ వ్యవస్థాగత లోపాలను సరిదిద్దడానికి, అంతర్రాష్ట్ర మానవ అక్రమ రవాణా ముఠాల నెట్‌వర్క్‌ను ఛేదించేందుకు సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది.

జస్టిస్ అహసానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ఆర్. మహాదేవన్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం.. చిన్నారుల అదృశ్యం కేసులను కేవలం 'మిస్సింగ్' కేసులుగా కాకుండా, అంతర్రాష్ట్ర ముఠాల కిడ్నాప్ కోణంలోనే దర్యాప్తు చేయాలని స్పష్టం చేసింది.

12లో

## మోదీ ప్రభుత్వం రూ.1,047 లక్షల కోట్ల అప్పు




- ప్రత్యేక హోదాపై రాహుల్ కార్డ్
- రాజ్యాంగ రక్షణపై కాంగ్రెస్ ఫోకస్
- బీజేపీ విధానాలపై జగ్గారెడ్డి ఫైర్

హైదరాబాద్, నేటిధాత్రి:
ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాపై తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అయితేనే ఏపీకి ప్రత్యేక హోదా వస్తుందని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కోసమైనా రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలని ఏపీ ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఆలోచన చేయాలని.. ఓటు ఎవరికో వేసి దేవుడిని ఏదో అడిగితే ఎవరూ ఏం చేయలేరని అన్నారు. హైదరాబాద్ గాంధీ భవన్‌లో జగ్గారెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీకి ప్రత్యేక హోదా సహా పలు అంశాలపై స్పందించారు.

తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మాట్లాడుతూ.. 'భక్తి అంటే నాది.. నేను రియల్ ఎస్టేట్‌లో సంపాదించిన డబ్బులతో సీతారాముల

12లో

## సెంట్రింగ్ కార్మికులతో చర్చించి, రెండు రోజుల్లో సమస్యలు పరిష్కరించాలి



- లేదంటే వాళ్లతో పాటు సమస్య తీరే వరకు నేనే ధర్నాలో కూర్చుంట
- గుంపు మేస్త్రీ అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాలు ఆగమావుతున్నాయి
- అందుకే గుంపు మేస్త్రీ హటావో....తెలంగాణ బచావో అంటున్నా
- సెంట్రింగ్ కార్మికుల డిమాండ్లను పట్టించుకోకపోతే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కర్రుకాల్చి వాత పెట్టటం ఖాయం
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్ , నేటిధాత్రి:
ఇందిరాపార్క్ వద్ద ధర్నాకు దిగిన సెంట్రింగ్ కార్మికులతో చర్చలు జరిపి వారి సమస్యను రెండు రోజుల్లో పరిష్కరించాలని తెలంగాణ రక్షణ

12లో



# నేటిధాత్రి

తెలుగు వార్త పత్రిక

22ND ANNIVERSARY



ఆదివారం 24-05-2026 పేజీలు : 12 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 51 రూ॥ 6.00


# అక్షర ప్రగతి పథంలో నేటిధాత్రి






పదునైన అక్షరం, చైతన్యవంతమైన భావం ఈ సమాజానికి అవసరమని, కలం, కాగితం చేత పట్టుకొని **"నేటిధాత్రి"** పత్రిక ప్రయాణం ప్రారంభించి **"22 వసంతాలు".**

తెలంగాణా ఉద్యమాన్ని తన భుజాల మీద మోస్తూ ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ ముందుకు సాగుతోంది. ఉద్యమం కోసం **"నేటిధాత్రి"** తనకు తాను సర్వస్వం త్యాగం చేసింది.

తెలంగాణా కోసం, ఆత్మ గౌరవం కోసం, తెలంగాణ ఆస్తిత్వం కోసం **"నేటిధాత్రి"** అక్షర పోరాటం ముందుండి చేసింది. ఇప్పుడు తెలంగాణ వికాసం కోసం సాగుతోంది. ప్రజా గొంతుకై నిటారుగా నిలబడుతోంది.

అందుకు **"నేటిధాత్రి"** కోసం ఎందరో **ఆత్మీయులు, శ్రేయోభిలాషులు, స్నేహితులు, సన్నిహితులు, సమాజ సేవకులు, మేధావులు, వ్యాపారులు, అధికారులు** ఇలా అన్ని రంగాలకు చెందిన సేవాతత్పరులు చేయూతనందిస్తూ వచ్చారు. వాళ్లందరికీ అక్షరాభివందనాలు, కృతజ్ఞతలు.

ఈ మీ సహకారం ఎల్లప్పుడూ ఉండాలని **"నేటిధాత్రి"** పత్రిక **22 వసంతాల** సందర్భంగా మీ అందరి సహాయ, సహకారాలతో మరింత ముందుకు సాగేలా ఆశీర్వదించాలని...

**అక్షర వేడుకతో...**

మీ
**కట్టా శివ సుబ్రహ్మణ్యం**
CEO, నేటిధాత్రి9 TV
డైరెక్టర్, ధాత్రి గ్రూప్స్

మీ
**కట్టా రాఘవేందర్ రావు**
చీఫ్ ఎడిటర్ - నేటిధాత్రి
CEO, ధాత్రి గ్రూప్స్

# ఆరోగ్య విప్లవానికి 'సంజీవని' శ్రీకారం

## ప్రజల ఆరోగ్య సంరక్షణే ప్రభుత్వ ధ్యేయమన్న సీఎం చంద్రబాబు






- ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పిలుపు
- యోగా, ధ్యానం, ప్రాణాయామం జీవనశైలిలో భాగం కావాలి
- ఆగస్టు 15 నాటికి రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని' అమలు
- భవిష్యత్తులో ప్రతి ఒక్కరికీ ఏఐ డాక్టర్ అందుబాటులోకి

చిత్తూరు, నేటిధాత్రి

ఆహారమే ఔషధం, వంటశాలే ఔషధశాల. ఈ మాట నేను ఎప్పుడూ చెబుతాను. మనం తినే ఆహారమే మనకు తిరుగులేని ఆరోగ్యాన్ని అందిస్తుంది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. శనివారం చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం, యాదమరి మండలం కండ్రిగలో నిర్వహించిన 'సంజీవని' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను వివరించారు. తన వరకు తాను పూర్తి ఆహార నియమాలు పాటిస్తానని, మంచి అలవాట్లు, మంచి ఆహారం, వ్యాయామం, మంచి ఆలోచనల ద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. యోగా, ధ్యానం, ప్రాణాయామం వంటివి జీవనశైలిలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సంపద ఉన్నవాళ్లకంటే ఆరోగ్యంగా ఉన్నవాళ్లే అదృష్టవంతులని ఉద్ఘాటించారు.

ఈ సందర్భంగా 'సంజీవని' కార్యక్రమం ప్రాముఖ్యతను సీఎం వివరించారు. 'రామ-రావణ యుద్ధంలో లక్ష్మణుడి ప్రాణాలు కాపాడేందుకు హనుమంతుడు సంజీవనిని తీసుకొచ్చారు. అదే స్ఫూర్తితో, డిజిటల్ హెల్త్ రికార్డులతో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఈ కార్యక్రమానికి 'సంజీవని' అని పేరు పెట్టాం. సంపద కంటే ఆరోగ్యమే గొప్పది. అందుకే ఆరోగ్యమే మహాభాగ్యమని పెద్దలు అన్నారు' అని చంద్రబాబు పేర్కొన్నారు.

ప్రపంచస్థాయి వైద్య సేవలను ప్రజలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఆగస్టు 15 నాటికి రాష్ట్రవ్యాప్తంగా సంజీవని



పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరికీ ఒక ఏఐ డాక్టర్ ఉంటారని తెలిపారు. సంజీవని పథకం విస్తరణలో భాగంగా డబ్బు, హోదా, కార్లు ఎన్ని ఉన్నా అన్నింటికీ మించింది ఆరోగ్యమేనని గుర్తు చేశారు.

సంజీవని పథకం కింద ఇంటి నుంచే 74 రకాల వైద్య పరీక్షలు చేయించుకునే అవకాశముందన్నారు. వ్యాధులు రాకముందే గుర్తించి, నివారించేందుకు ప్రిడిక్టివ్,



ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానంలో ఈ ప్రాజెక్టును రూపొందించినట్లు తెలిపారు. గత జూలైలో కుప్పంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించి, మార్చి 15 నుంచి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని 19.75 లక్షల మంది ఆరోగ్యాన్ని కాపాడేలా చర్యలు తీసుకుంటున్నామని, ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రాజెక్టును ప్రారంభిస్తామని ప్రకటించారు.

ఈ పథకంలో భాగంగా 42 రకాల వైద్య పరీక్షలను ప్రజల ఇళ్ల వద్దే నిర్వహించి, రిపోర్టులు అందిస్తామన్నారు. డాక్టర్ అపాయింట్‌మెంట్, వర్చువల్ కనెక్ట్ ద్వారా వైద్య సలహాలు, వ్యక్తిగత ఆరోగ్య రికార్డుల డిజిటలైజేషన్ వంటి సేవలు అందిస్తున్నట్లు వివరించారు. త్వరలోనే ఏఐ డాక్టర్ ద్వారా కూడా వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి వ్యక్తికి ఒక ఏఐ డాక్టర్ ఉంటాడని స్పష్టం చేశారు.

వైద్య ఖర్చుల భారం నుంచి కుటుంబాలను గట్టెక్కించడమే ప్రభుత్వ లక్ష్యమని, విద్య, వైద్య రంగాలకు ప్రజా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ ఏడాది వైద్యరంగానికి రూ. 19,305 కోట్లు కేటాయించామని, 15వ ఆర్థిక సంఘం నుంచి దేశంలోనే అత్యధికంగా రూ. 2,601 కోట్ల ఆరోగ్య గ్రాంట్లు సాధించామని గుర్తు చేశారు. యూనివర్సల్ హెల్త్ పాలసీ కింద ప్రతి ఒక్కరికీ రూ. 2.5 లక్షల విలువైన వైద్యం, ఎన్టీఆర్ వైద్య సేవ, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ. 25 లక్షల వరకు ఖర్చులు భరిస్తామని హామీ ఇచ్చారు.

ప్రకృతి బాగుంటేనే మనం బాగుంటామని, పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని సీఎం చంద్రబాబు అన్నారు. సమర్థ నీటి నిర్వహణతో భూగర్భ జలాలను పెంచగలిగామని, దీనికి అన్నమయ్య జిల్లానే నిదర్శనమని చెప్పారు. ప్రభుత్వ యంత్రాంగం చర్యలతో అక్కడ భూగర్భ జలాలు 8.5 మీటర్లు పెరిగి, పచ్చదనం పెరిగిందన్నారు. రాష్ట్రంలో తీవ్ర ఉష్ణోగ్రతలు నమోదవుతుంటే, అన్నమయ్య జిల్లాలో ఉష్ణోగ్రతలు తగ్గాయని తెలిపారు. పిడుగురాళ్లలో 49 డిగ్రీలు నమోదైతే, అన్నమయ్యలో 40 డిగ్రీలే నమోదయ్యాయని నివేదికలను ఉటంకించారు.

సాగునీటి ప్రాజెక్టులపై సంకల్పంతో పనిచేస్తున్నామని, ఏ ప్రాజెక్టు ఎప్పుడు పూర్తి చేస్తామో క్యాలెండర్ విడుదల చేశామని చంద్రబాబు తెలిపారు. నీవా పనులు పూర్తి చేసి పూతలపట్టు మీదుగా చిత్తూరు వరకు కృష్ణా నీటిని తెస్తామని, కల్యాణి డ్యాంకు కూడా నీళ్లు అందిస్తామని హామీ ఇచ్చారు. గాలేరు-నగరి, మల్లెమడుగు, సోమశిల-స్వర్ణముఖి లింక్ కెనాల్ వంటి ప్రాజెక్టుల పూర్తికి గడువులు ప్రకటించారు. ప్రజల భవిష్యత్తుకు భరోసా ఇవ్వడమే తమ లక్ష్యమని, ఆ దిశగా నిరంతరం పనిచేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

# ప్రధానితో కుటుంబ సమేతంగా రామ్మోహన్ భేటీ



- మోదీతో సమావేశాన్ని జీవితాంతం గుర్తుండే క్షణంగా అభివర్ణించిన కేంద్ర మంత్రి
- 'ఏక్ పేడ్ మా కే నామ్'కు గుర్తుగా మొక్క బహుకరణ

న్యూఢిల్లీ, నేటిధాత్రి:

కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శనివారం తన కుటుంబ సభ్యులతో కలిసి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి తల్లి ప్రధానమంత్రికి మొక్కను బహుకరించారు. కుటుంబంతో కలిసి ప్రధానిని కలిసిన అనుభూతిపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఎక్స్ వేదికగా భావోద్వేగ పోస్టు చేశారు.

ఆ పోస్టులో.. 'ఈ రోజు మా కుటుంబానికి జీవితాంతం గుర్తుండిపోయే ఓ భావోద్వేగ క్షణం. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కుటుంబ సమేతంగా కలిసే అవకాశం లభించడం ఎంతో ఆనందంగా, గర్వంగా భావిస్తున్నాను' అని పేర్కొన్నారు. ప్రధాని మోదీ అసాధారణ వ్యక్తిత్వం, ఆయన ఆప్యాయత తమ కుటుంబంలోని మూడు తరాలను ఒకేలా ఆకట్టుకుందని తెలిపారు. ప్రజల హృదయాల్లో ఆయన ఎందుకు విశేష ఆదరణ పొందుతున్నారో ఆ క్షణంలో మరింత స్పష్టంగా అర్థమైందని వివరించారు.

### మొక్క బహుకరణ ప్రత్యేక ఆకర్షణ

ప్రత్యేకంగా 'ఏక్ పేడ్ మా కే నామ్' అనే మహత్తర ఆలోచనకు ప్రేరణగా తన తల్లి ప్రధానమంత్రికి మొక్కను బహుకరించడం తమ కుటుంబానికి ఎంతో మధురమైన, గర్వకారణమైన క్షణంగా నిలిచిపోయిందని పేర్కొన్నారు.

### ప్రధాని ఆప్యాయతపై కృతజ్ఞతలు


ప్రధాని మోదీ చూపిన ప్రేమ, ఆప్యాయత, ఆశీస్సులకు తమ కుటుంబం ఎప్పటికీ కృతజ్ఞులమని రామ్మోహన్ నాయుడు తెలిపారు. తమతో గడిపిన అమూల్యమైన సమయానికి ఆయనకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

# పశ్చిమాసియాలో సడలని ఉద్రిక్త పరిస్థితులు

టెహ్రాన్, నేటిధాత్రి:

పశ్చిమాసియాలో పరిస్థితులు ఎప్పటికప్పుడు మారిపోతున్నాయి. ఓవైపు చర్చలు కొనసాగుతుండగానే.. ఇరాన్‌పై మరోసారి దాడికి దిగేందుకు అమెరికా సన్నద్ధమవుతుందంటూ వార్తలు వెలువడ్డాయి. ఈ క్రమంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్ తన గగనతలాన్ని మూసివేసింది. దేశంలోని పశ్చిమ ప్రాంతం వైపున్న గగనతలాన్ని మూసివేస్తున్నట్లు ఇరాన్ పౌర విమానయాన సంస్థ విమానయాన సిబ్బందికి నోటమ్ జారీ చేసింది. ఈ నెల 25 వరకు అన్ని విమానాల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు తెలిపింది. ఈ నోటమ్ జారీ చేసే సమయంలో ఖతార్ ప్రభుత్వానికి చెందిన ఓ వీఐపీ విమానం ఇరాన్ గగనతలాన్ని దాటింది. ఆ విమానం శాంతి ఒప్పందానికి సంబంధించిన చర్చల కోసం టెహ్రాన్‌కు వచ్చిన ఖతార్ ప్రతినిధి బృందానికి చెందినదిగా తెలుస్తోంది. ఇక అమెరికా-ఇరాన్ మధ్య చర్చలు తుది దశకు చేరుకున్నాయని, ఒప్పందానికి సంబంధించిన చాలా అంశాల్లో ఇరు దేశాల మధ్య సయోధ్య కుదిరినట్లు తెలుస్తోంది. దీంతో ఏ క్షణమైనా ఒప్పంద ప్రకటన వెలువడే అవకాశముంది. అదే సమయంలో ఈ దౌత్య ప్రయత్నాలు చివరి నిమిషంలో విఫలమైతే.. టెహ్రాన్‌పై మళ్లీ దాడులు చేసే విషయాన్ని అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో ఇరాన్ కూడా తన గగనతలాన్ని మూసివేయడంతో పశ్చిమాసియాలో ఏ క్షణాన ఏం జరుగుతుందోననే భయాందోళనలు నెలకొన్నాయి. అమెరికా మరోసారి దాడులకు సిద్ధం అవుతోందన్న వార్తల నేపథ్యంలో ఇరాన్ ఇలా అప్రమత్తమైంది. ఈ పరిణామంతో గల్ఫ్‌లో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. యూఎస్ మరోసారి యుద్ధాన్ని ప్రారంభించిన పక్షంలో దీటుగా ఎదుర్కొనేందుకు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్, ఇతర సాయుధ దళాలు సిద్ధమవుతున్నట్టు ఇరాన్ వార్తా సంస్థ తస్నిమ్ ఒక కథనాన్ని ప్రచురించింది. అమెరికా ఆస్తులకు నష్టం కలిగేలా, ప్రయోజనాలు దెబ్బతినేలా దాడులకు ప్రణాళికలను ఇరాన్ మిలిటరీ సిద్ధం చేసినట్టు సమాచారం. ఈ వారాంతాన్ని న్యూజెర్సీలో గడపాల్సిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చివరి నిమిషంలో తన ప్రణాళికలను అకస్మాత్తుగా రద్దు చేసుకుని రాజధాని వాషింగ్టన్‌కు తిరిగొచ్చారు. దీంతో పశ్చిమాసియాలో మళ్లీ ఘర్షణలు మొదలవుతాయన్న వార్తలు మీడియాలో వెలువడ్డాయి. ఈ వారాంతంలో మెమోరియల్ డే వేడుకల్లో పాల్గొనాల్సిన అమెరికా నిఘా సంస్థల సీనియర్ అధికారులు కూడా తమ ప్రణాళికలను రద్దు చేసుకుని వాషింగ్టన్‌కు తిరిగొచ్చేశారు. రాబోయే 24 గంటల్లో దౌత్యపరమైన పురోగతి లేని పక్షంలో దాడులు మొదలుపెట్టేందుకు ట్రంప్ కూడా సుముఖంగానే ఉన్నట్టు స్థానిక మీడియాలో కథనాలు వెలువడ్డాయి. పరిస్థితులు అంతకంతకూ ఉద్రిక్తంగా మారుతున్నా తెరవెనుక దౌత్యమార్గాల్లో ప్రయత్నాలు ముమ్మర స్థాయిలో జరుగుతున్నట్టు తెలుస్తోంది. చర్చల్లో కొంత పురోగతి కనిపించిందని విశ్వసనీయ వర్గాలు చెప్పినట్టు తస్నిమ్ వార్తా సంస్థ పేర్కొంది.

# గోదావరి పుష్కరాలకు భారీ నిధులు..



- విద్యా, ఉద్యోగ రంగాలకు కేబినెట్ గుడ్‌న్యూస్
- గోదావరి పుష్కరాల కోసం రూ. 1000 కోట్లకు ఆమోదం
- జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలుకు గ్రీన్ సిగ్నల్
- గంగాధర కాలేజీ పోస్టుల భర్తీ, కేసముద్రం ఫైర్ స్టేషన్ పోస్టులకు ఆమోదం

హైదరాబాద్, నేటిధాత్రి:

వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నేపథ్యంలో సంబంధిత అభివృద్ధి పనులకు రూ. 1000 కోట్లు కేటాయిస్తూ తెలంగాణ మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. తొలి విడతగా రూ. 300 కోట్ల మంజూరుకు పచ్చజెండా ఊపింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజన పథకం అమలుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పాఠశాలలతో పాటు జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు ఉదయం అల్పాహారం, పాలు అందించాలని నిర్ణయించింది. అస్సాం రైఫిల్స్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్ సెంటర్ల ఏర్పాటుకు కరీంనగర్ జిల్లాను ఎంపిక చేసింది. కేసముద్రం ఫైర్ స్టేషన్‌కు 18 పోస్టుల మంజూరుకు అంగీకారం తెలిపింది.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ కేబినెట్ శనివారం సమావేశమైంది. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై మంత్రిమండలి చర్చించింది. ఈ సందర్భంగా కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేసేందుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పాఠశాలలతో పాటు జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు ఉదయం అల్పాహారం, పాలు అందించాలని మంత్రిమండలి నిర్ణయించింది.

2027 గోదావరి పుష్కరాల పనులకు రూ. 1000 కోట్లు కేటాయిస్తూ తెలంగాణ కేబినెట్ ఆమోదం తెలిపింది. తొలి విడతగా రూ. 300 కోట్ల మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మరోవైపు నిరుద్యోగ యువతకూ మంత్రిమండలి గుడ్‌న్యూస్ చెప్పింది. కరీంనగర్ జిల్లా గంగాధరలోని డిగ్రీ కళాశాలలో నియామకాలకు పచ్చజెండా ఊపింది.

20 రెగ్యులర్ టీచింగ్ పోస్టులు, 6 నాన్ టీచింగ్ పోస్టులు, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో మరో 3 పోస్టుల మంజూరుకు ఆమోదం తెలిపింది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం అగ్నిమాపక కేంద్రానికి సంబంధించి 18 పోస్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.



# బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి

## సమస్యాత్మక ప్రాంతాల్లో సీసీ కెమెరాల నిఘా

- శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు
- ముస్లిం, గోరక్షక్ ప్రతినిధులతో మల్కాజిగిరి సీపీ సుమతి సమావేశం



మేడ్చల్ మల్కాజ్గిరి, నేటిదాత్రి :

బక్రీద్ పండుగను ప్రజలందరూ పరస్పర సహకారంతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి ఐపీఎస్ పిలుపునిచ్చారు. పండుగ నేపథ్యంలో నేరడ్‌మెట్‌లోని సీపీ కార్యాలయంలో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ఐఏఎస్‌తో కలిసి ఆమె శనివారం వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ముస్లిం పెద్దలు, గోరక్షక్ సభ్యులతో విడివిడిగా సమన్వయ సమావేశం నిర్వహించారు.

?ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. సమాజంలో ఐక్యతకు పండుగలు ప్రతీకలని, ఎలాంటి అపోహలు, వదంతులకు తావివ్వకుండా పండుగను జరుపుకోవాలని సూచించారు. ముఖ్యంగా సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలను ఎవరూ నమ్మవద్దని కోరారు. సమస్యాత్మక ప్రాంతాల్లో సీసీ కెమెరాల ద్వారా నిరంతరం నిఘా కొనసాగుతుందని స్పష్టం చేశారు.

### చట్టాన్ని చేతిలోకి తీసుకుంటే ఉపేక్షించం..

ఎవరూ కూడా చట్టాన్ని చేతిలోకి తీసుకోకూడదని సీపీ హెచ్చరించారు. గోవులను తరలించే వాహనాలను అడ్డుకోవడం, వ్యక్తులపై దాడులు చేయడం, బలవంతంగా తనిఖీలు నిర్వహించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని గోరక్షక్ సభ్యులకు స్పష్టం చేశారు. ఎక్కడైనా అనుమానాస్పద వాహనాలు లేదా అక్రమ రవాణా గమనిస్తే తక్షణమే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

### పరిశుభ్రత పాటించాలి..

ప్రభుత్వం అనుమతించిన ప్రదేశాల్లోనే జంతు వధ నిర్వహించాలని, బహిరంగ ప్రదేశాల్లో జంతు అవశేషాలను పారవేయకుండా మున్సిపల్ సిబ్బందికి సహకరిస్తూ పరిశుభ్రత పాటించాలని కోరారు. ఈ సమావేశంలో ఎల్బీనగర్ డీసీపీ అనురాధ, మల్కాజిగిరి డీసీపీ శ్రీధర్, ఉప్పల్ డీసీపీ సురేష్, ఎస్బీ డీసీపీ నరసింహారెడ్డి, ఉమెన్ సేఫ్టీ డీసీపీ ఉషారాణి, అడ్మిన్ డీసీపీ ఇందిరా, ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసులు, హెడ్‌క్వార్టర్స్ డీసీపీ శ్యాంసుందర్, అడిషనల్ డీసీపీలతో పాటు వెటర్నరీ, రెవెన్యూ, వాటర్ వర్క్స్, ఫైర్, మెడికల్, రోడ్ ట్రాన్స్‌పోర్ట్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రిజర్వేషన్లతో కొందరికే లబ్ధి!

- రిజర్వేషన్ల ఫలాలు కొందరికేనా..?
- తరతరాల రిజర్వేషన్లు.. మిగతావారికి అన్యాయమా?
- రిజర్వేషన్ వ్యవస్థపై కొత్త చర్చ అవసరమా?
- క్రిమీలేయర్‌కు చెక్ పెట్టాల్సిన సమయమా?
- రిజర్వేషన్లపై సుప్రీం కీలక ప్రశ్నలు
- ఒకే కుటుంబానికి వరుస లబ్ధి.. మిగతావారి పరిస్థితి?
- రిజర్వేషన్ ప్రయోజనాలు చివరి వ్యక్తికి చేరుతున్నాయా?

డెస్క్, నేటిధాత్రి:

స్వాతంత్ర్యం లభించి 80 ఏళ్లకు చేరువలో ఉన్నాం. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ప్రజలు త్యాగాలు చేస్తుంటే, కొందరు ఫలితాలు అనుభవిస్తున్నారు. ముఖ్యంగా భారతదేశంలో రాజకీయ నేతలు, ప్రజాప్రతినిధులు అనుభవిస్తున్న లగ్జరీ జీవితం అంతా ఇంతా కాదు. ఒక్కసారి ఎమ్మెల్యే, ఎంపీ అయితే చాలు.. జీవితాంతం సుఖంగా బతికేయవచ్చనే పరిస్థితి ఏర్పడింది. పేరుకే ప్రజాస్వామ్యం కానీ.. అదృష్టమంతా ప్రజాప్రతినిధులదే. అధికారాన్ని గుప్పిట్లో పెట్టుకుని ప్రజలను ఓట్లేసే యంత్రాల్లా చూస్తున్నారు. కొన్ని తాయిలాలు ప్రకటించి, మొత్తం అధికారం, ఆర్థిక స్వేచ్ఛను వారు అనుభవిస్తున్నారు. అందుకే ప్రజల్లో నివురుగప్పిన నిప్పులా ఉన్న ఆగ్రహం అప్పుడప్పుడు కట్టలు తెంచుకుంటోంది. ఒక్కోసారి చిన్న సమస్యగా ఉన్న వ్యవహారం పెద్ద ఎత్తున ఉవ్వెత్తున ఎగిసిపడుతోంది. ఇటీవల కాక్రోచ్ జనతా పార్టీ ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవాలి. ప్రజల్లో ఏమిటో దాగివున్న ఆగ్రహం ఇలా బయటకు వస్తోంది.

వివిధ రూపాల్లో ఉన్న వ్యతిరేకత ఒక్కటైతే రాజకీయ పార్టీల నేతలు తట్టుకోవడం కష్టం. అనేక దేశాల్లో ఇలాగే ప్రజాగ్రహం కట్టలు తెంచుకున్న సంగతి చూశాం. నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక, వెనిజులా తదితర దేశాల్లో ప్రజల ఆగ్రహం ఎలా పరిణమించిందో చూశాం.

అందువల్ల పాలకులు ప్రజాసంక్షేమం కోరి నిర్ణయాలు తీసుకోవాలి. వాటిని ఆచరణలో పెట్టాలి. నిరంతరం సమస్యలతో పోరాడుతున్న ప్రజలను పట్టించుకోవాలి. తమ సుఖం కాదు.. ప్రజల సంక్షేమం ముఖ్యమని గమనించాలి. ధాన్యం కొనుగోళ్లు కావచ్చు, ఫీజుల మోత కావచ్చు, నిరుద్యోగం కావచ్చు.. ఇలా అనేక సమస్యలపై ప్రజల్లో ఆందోళనలు గూడుకట్టుకుని ఉన్నాయి. అందుకే తరతరాలుగా అధికారంలో తామే ఉండాలన్న కుటిల రాజకీయాలు మానాలి. ఇకపోతే తాజాగా సుప్రీం ధర్మాసనం రిజర్వేషన్ల తీరుపై అసహనం వ్యక్తం చేసింది. దీనిపై చర్చ జరగాలి. చట్టసభల్లో ఇలాంటి వాటిపై చర్చించాలి. కొందరే రిజర్వేషన్ల ఫలాలు అనుభవించడంపై సుప్రీం సంచలన వ్యాఖ్యలు చేసింది. కొందరే వీటిని పదేపదే అనుభవించడం ద్వారా మిగతావారికి అడ్డుపడుతున్నారని అభిప్రాయపడింది. గతంలో సీజేఐగా పనిచేసిన బీఆర్ గవాయ్ కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. క్రిమీలేయర్ ఉండాలని ఆయన ఆనాడు అభిప్రాయపడ్డారు. కొందరు రిజర్వేషన్లు అనుభవించాక, తమ కుటుంబంలోని వారంతా అదే రిజర్వేషన్ల మెట్లు ఎక్కాలని చూస్తున్నారు.

తాజాగా ఇప్పుడు సుప్రీం ధర్మాసనం కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేసింది. వెనుకబడిన తరగతుల్లోని ఆర్థికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందిన కుటుంబాల పిల్లలకు రిజర్వేషన్ ప్రయోజనాలను కొనసాగించాలని కోరడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది.

ఉన్నత స్థితికి చేరుకున్న కుటుంబాలు పదేపదే రిజర్వేషన్ ప్రయోజనాలు పొందడంపై ఆందోళన వ్యక్తం చేసింది. ఎందుకంటే ఇలా రిజర్వేషన్లు పొందిన వారు రాజకీయంగా వారే స్థిరపడిపోతున్నారు. ఉన్నత శ్రేణి ఉద్యోగాలు సాధించిన ఐఏఎస్, ఐపీఎస్‌లు కూడా తమ పిల్లలకు రిజర్వేషన్లు పొందిస్తున్నారు. దీనినే సుప్రీం ధర్మాసనం ప్రశ్నించింది. దేశంలో రిజర్వేషన్ల ఫలాలు అందుకొని సామాజికంగా, ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరిన కుటుంబాలు తరతరాలుగా అదే కోటాను కోరుకోవడంపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. "తల్లిదండ్రులు ఇద్దరూ ఐఏఎస్ అధికారులై, ప్రభుత్వ సర్వీసుల్లో ఉంటూ పూర్తి స్థాయిలో స్థిరపడినప్పుడు, ఇక వారి పిల్లలకు రిజర్వేషన్ల కోటా ఎందుకు?" అని అత్యున్నత న్యాయస్థానం సంచలన ప్రశ్నలు సంధించింది. ఇది చర్చించాలి. లేకుంటే ప్రజల్లో ఇలాంటి వ్యత్యాసాలపైనా వ్యతిరేకత వస్తుంది. ఎక్కడో ఒకచోట దీనికి చెక్ పెట్టాలి. రిజర్వేషన్లు ఎల్లకాలం కాదన్న నిజం బయటకు రావాలి. అవసరమైతే చట్టం చేయాలి. వెనుకబడిన వర్గాల్లోని క్రిమీలేయర్ పరిమితులు, రిజర్వేషన్ల మినహాయింపులపై దాఖలైన పిటిషన్లను విచారించిన సందర్భంగా జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా జస్టిస్ బి.వి. నాగరత్న మాట్లాడుతూ.. విద్య, ఆర్థిక సాధికారత ద్వారా సమాజంలో ఒక స్థాయి లభిస్తుందని పేర్కొన్నారు.

"రిజర్వేషన్ల ద్వారా ఒకసారి ఉన్నత స్థాయికి చేరుకున్నాక కూడా, మళ్లీ వారి పిల్లల కోసం రిజర్వేషన్ కోటాను ఆశించడం సరికాదు. ఇలాగైతే మనం రిజర్వేషన్ల వ్యవస్థ నుంచి ఎప్పటికీ బయటపడలేం" అని వ్యాఖ్యానించారు. ఒక వ్యక్తి సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉండవచ్చుని.. కానీ, రిజర్వేషన్ల ప్రయోజనం పొంది తల్లిదండ్రులు ఉన్నత స్థానాలకు వెళ్లినప్పుడు వారి పిల్లల పరిస్థితి మారుతుందని, ఇక్కడ ఒక సమతుల్యత అవసరమని కోర్టు స్పష్టం చేసింది. ఒకే కుటుంబంలో ఉన్నత వర్గాలే అన్ని అవకాశాలను చేజిక్కించుకుంటే, అదే వర్గంలోని అత్యంత వెనుకబడిన పేదలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. రిజర్వేషన్ల ఫలాలు కేవలం కొందరికే పరిమితం కాకుండా, సమాజంలో కిందిస్థాయిలో ఉన్న చివరి వ్యక్తికి కూడా అందాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయపడింది. రాజకీయంగా ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు పొందుతున్న వారు తమ కుటుంబాలకు కూడా రిజర్వేషన్ కోటాలో లబ్ధి పొందుతున్నారు. ఒకే కుటుంబం నుంచి రిజర్వేషన్ల కోటాలో ఎన్నికై ఎమ్మెల్యేలు, ఎంపీలు అయి మంత్రి పదవులు అనుభవిస్తున్నారు. ఇలాంటి వారివల్ల పక్కన ఉన్నవారు ఎన్నటికీ రిజర్వేషన్లు పొందలేకపోతున్నారు. దీనిపై దేశవ్యాప్తంగా చర్చ జరగాలి. ఇప్పుడు రాజకీయాల్లోనూ రిజర్వేషన్లపై చర్చించాలి. అప్పుడే మిగతా వారికి రిజర్వేషన్ ఫలాలు దక్కుతాయి.

# మూడు కోట్ల 66 లక్షల లక్షల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**పాటన్‌చేరు, నేటిధాత్రి:** పటాన్చెరు నియోజకవర్గం అమీన్పూర్ డివిజన్, బీరంగూడ డివిజన్ల పరిధిలోని వివిధ కాలనీలు, విలీన గ్రామాలలో 3 కోట్ల 66 లక్షల రూపాయలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన పటాన్చెరు సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డిశర వేగంగా అభివృద్ధి చెందుతున్న బీరంగూడ, అమీన్పూర్ డివిజన్ల పరిధిలోని ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని ఆయన తెలిపారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకుల ద్వారా ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. హాజరైన మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ సత్యనారాయణ, మాజీ ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజలు.

# హిందువులు ఐకమత్యంగా ముందుకు వెళ్లాలి

## ఆర్ఎస్ఎస్ వరంగల్ విభాగ్ సంఘం బాలక్ పెద్దిరెడ్డి మల్లారెడ్డి



**గణపురం, నేటిధాత్రి:** గణపురం మండల కేంద్రంలో హిందువులంతా ఐక్యమత్తంగా ముందుకు వెళ్లాల్సిన పరిస్థితులు ఆసన్నమయ్యాయని ఆర్ఎస్ఎస్ వరంగల్ విభాగ్ సంఘం బాలక్ రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు పెద్దిరెడ్డి మల్లారెడ్డి అన్నారు. శనివారం గణపురం మండల కేంద్రంలోని శ్రీ పట్టాభి సీతా రామచంద్రస్వామి దేవాలయంలో పట్టాభిరామాలయ శ్రీరామ భజన మండలి సభ్యులు బటీకే స్వామి అధ్యక్షతన హిందు సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మల్లారెడ్డి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా హిందువులు ఒక తాటిపైకి వచ్చి సనాతన ధర్మాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమ్మేళనంలో బుర్ర సదయ్య భూపాలపల్లి ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవాహ గణపురం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కట్కూరి రాధిక శ్రీనివాస్ మాజీ ఎంపీపీ వడ్లకొండ నారాయణ గౌడ్, ఉప సర్పంచ్ ఓరుగంటి కృష్ణ గౌడ్ పట్టాభిరామ స్వామి ఆలయ కమిటీ సభ్యులు బండారి శంకర్ మాదాసు మొగిలి గౌడ్ రామస్వామి ఉయ్యాల బిక్షపతి గౌడ్ రావుల సురేష్ గౌడ్ మోటపోతుల రాజన్న గౌడ్ మాదాసు అర్జున్ గౌడ్ తాళ్లపల్లి గోవర్ధన్ గౌడ్ బూర రాజగోపాల్ గౌడ్ మూల శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# యర్కారం హత్య కేసులో వేగంగా దర్యాప్తు..

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్



**సూర్యాపేట, నేటిధాత్రి:** మండలం పరిధిలోని యర్కారం గ్రామంలో బిఆర్ ఎస్ నాయకుడు చింతలపాటి మధు దారుణ హత్య ఘటన జిల్లాలో తీవ్ర కలకలం రేపుతోంది. ఘటనపై సమాచారం అందుకున్న సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ సంఘటన స్థలాన్ని స్వయంగా సందర్శించి పరిస్థితిని పరిశీలించారు.
ఈ సందర్భంగా మృతుడు చింతలపాటి మధు కుటుంబ సభ్యులను, ముఖ్యంగా ఆయన భార్య మరియు కుమార్తెను పరామర్శించి ధైర్యం చెప్పారు. కేసులో నిందితులను త్వరితగతిన గుర్తించి వెంటనే అరెస్ట్ చేస్తామని బాధిత కుటుంబానికి ఎస్పీ హామీ ఇచ్చారు.



ఘటనకు సంబంధించిన ప్రతి కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. ఇప్పటికే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు సమాచారం. కాగా చింతలపాటి మధు హత్య ఘటనతో యర్కారం గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా గ్రామంలో భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉందన్నారు.

# వడదెబ్బతో మృతి చెందిన వెల్దండి వెంకటేశ్వర్లుకు నివాళి

## కుటుంబానికి ప్రభుత్వ సహాయం అందించాలి...9వార్డ్ కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణ చారి



**పరకాల, నేటిధాత్రి:** పట్టణంలోని శ్రీనివాస కాలనీలో విషాద ఘటన చోటుచేసుకుంది. పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన నిరుపేద వ్యక్తి వెల్దండి వెంకటేశ్వర్లు తీవ్ర ఎండల కారణంగా వడదెబ్బకు గురై మృతి చెందారు. ఆర్థికంగా అత్యంత వెనుకబడిన పరిస్థితుల్లో జీవిస్తున్న ఆయనకు కనీసం నివసించడానికి సొంత ఇల్లు కూడా లేకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మృతదేహాన్ని ఇంటి వద్ద ఉంచేందుకు కూడా ఇబ్బందులు తలెత్తడంతో, ఇంటి యజమానులు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న కౌన్సిలర్ శ్రీనివాస కాలనీలోని పద్మశాలి చేనేత సంఘం సభ్యులు మానవత్వంతో స్పందించి, మృతదేహాన్ని సంఘం భవనం వద్ద ఉంచేందుకు సహకరించారు. ఈ సందర్భంగా స్థానిక కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణాచారి సంఘం వద్దకు చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళు



లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వడదెబ్బతో మరణించిన వెంకటేశ్వర్ల కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటివరకు 34 మంది వడదెబ్బతో మృతి చెందినట్లు సమాచారం ఉందని, వారందరి కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే రూ. 4 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి సహాయం అందించాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మధ్యాహ్న సమయంలో అత్యవసరం లేకుండా బయటకు రావద్దని సూచించారు. నిరుపేద కుటుంబాలకు స్థానిక ప్రజలు, సేవా సంస్థలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.
ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపగా, పలువురు ప్రజాప్రతినిధులు, చేనేత సంఘం నాయకులు, కాలనీవాసులు వెంకటేశ్వర్ల కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

# నర్సంపేట మహిళా కారాగారంలో లీగల్ ఎయిడ్ హెల్ప్ డెస్క్ ప్రారంభం

## మహిళా ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందుబాటులోకి




**నర్సంపేట, నేటిధాత్రి:** వరంగల్ జిల్లా నర్సంపేట ప్రత్యేక మహిళా కారాగారంలో ఖైదీలకు చట్టపరమైన సేవలు వేగంగా, సులభంగా అందించేందుకు "లీగల్ ఎయిడ్ హెల్ప్ డెస్క్"ను ప్రారంభించినట్లు వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి న్యాయమూర్తి ఏ. ప్రదీప్ తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జైలుకు వచ్చే ఖైదీల కుటుంబ సభ్యులు, బంధువులకు "ములాఖత్" ప్రక్రియను సరళీకరించడం ఈ డెస్క్ ప్రధాన ఉద్దేశమన్నారు. ముఖ్యంగా మహిళా సంరక్షకులు, వృద్ధులు, వికలాంగులు, ఆర్థికంగా వెనుకబడిన వారికి అవసరమైన న్యాయ అవగాహన, మార్గదర్శకత్వం ఇక్కడ అందిస్తామని తెలిపారు. ఖైదీలను కలిసేందుకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిబంధనలపై అవగాహన కల్పించడంతో పాటు, అవసరమైన చట్టపరమైన సహాయం అందజేస్తామని చెప్పారు. అర్హులైన ఖైదీలకు ఉచిత



న్యాయ సలహాలు అందించడంతో పాటు, ప్రైవేట్ న్యాయవాదులను నియమించుకోలేని వారికి ప్రభుత్వ ఖర్చుతో ప్యానెల్ లాయర్లను కేటాయిస్తామని వివరించారు. బెయిల్ దరఖాస్తులు, కేసుల ప్రస్తుత స్థితి, కోర్టు ఆదేశాలు, అవసరమైన పత్రాల భద్రత వంటి అంశాలపై ఖైదీల కుటుంబాలకు సహాయం అందించనున్నట్లు తెలిపారు. లీగల్ ఎయిడ్ వాలంటీర్లు కేసుల పురోగతిపై సమాచారం అందిస్తారని చెప్పారు. "చట్టం ముందు అందరూ సమానులే. జైలులో ఉన్నంత మాత్రాన ప్రాథమిక హక్కులు కోల్పోరు. ఖైదీలు, వారి కుటుంబాలు ఈ హెల్ప్ డెస్క్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి" అని న్యాయమూర్తి ఏ. ప్రదీప్ సూచించారు. అనంతరం న్యాయమూర్తులు మహిళా ఖైదీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట న్యాయమూర్తులు ఎం.డి. యూసుఫ్, గిరిధర్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఆర్. రజినీ, జైలు సందర్శక న్యాయవాది టి. సునిత, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ఎన్. ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం

## ప్రతి కాలనీలో సొసైటీ సభ్యులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి....15 రోజుల్లో చాకచాక్యంగా వ్యవహరించి దొంగతనం కేసును ఛేదించిన అమీన్ పూర్ పోలీసులను ప్రజలు అభినందిస్తున్నారు.... దొంగ వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న బంగారాన్ని బాధితులకు అందజేసిన ఎసిపి శ్రీనివాస్



**పాటన్‌చేరు, నేటిధాత్రి:** ప్రతి కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసుల తో సమానమని శేరిలింగంపల్లి ఏసిపి శ్రీనివాస్ అన్నారు శనివారం నాడు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొనారు ఒక్క సీసీ కెమెరాను ఆధారంగా చేసుకుని ఓ ఇంట్లో దొంగతనం చేసిన అరకేజీ బంగారాన్ని స్వాధీనం చేసుకుని దొంగను అరెస్టు చేశారు అమీన్ పూర్ పోలీసులు. సీసీ కెమెరాలను ఆధారం చేసుకుంటూ 15 రోజుల్లో చాకచాక్యంగా వ్యవహరించి దొంగతనం కేసును ఛేదించిన అమీన్ పూర్ పోలీసులను ప్రజలు అభినందిస్తున్నారు. ప్రతీ కాలనీలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, సమ్మర్ హాలిడేస్ లలో దొంగతనాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బందంకొమ్ములో ఆయా కాలనీ వాసులతో అమీన్ పూర్ పోలీసులు సమావేశమై అవగాహన కల్పించారు.



దొంగ వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న బంగారాన్ని శేరిలింగంపల్లి ఏసీపీ శ్రీనివాస్ కుమార్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ అమీన్ పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బందంకొమ్ము హిల్ టాప్ హోమ్స్ లో ఉంటున్న వెంకట రమణ, భవాని ఇంట్లో ఏప్రిల్ 14న దొంగతనం జరిగి అరకిలో బంగారాన్ని ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు 15న కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అమీన్ పూర్ క్రైమ్ బ్రాంచ్ సీఐ సత్యనారాయణ, సీఐ నరేష్ బృందాలు విచారణ చేపట్టాయన్నారు. దొంగతనం జరిగిన ఇంట్లో సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ అవి పనిచేయడం లేదని, కాలనీలో సత్యనారాయణ ఏర్పాటు చేసుకున్న ఒక్క సీసీ కెమెరా ఆధారంగా దర్యాప్తును ముమ్మరం చేసినట్లు చెప్పారు. దొంగతనానికి పాల్పడిన నిందితుడు శివను పట్టుకుని విచారించగా అతని వద్ద ఉన్న రూ. 50 లక్షల విలువ గల



అరకిలో బంగారం ఆభరణాలను స్వాధీనం చేసుకుని కాలనీ వాసులందరి సమక్షంలో బాధితులకు అప్పగించినట్లు ఏసీపీ శ్రీనివాస్ తెలిపారు. ప్రతీ ఇంటికి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, ఊర్లలోకి వెళ్లేటప్పుడు ఇంటి గేటుకు బయట తాళం వేయరాదని, మెయిన్ డోర్లకు సెంట్రల్ లాక్ సిస్టమ్ ను ఏర్పాటు చేసుకోవాలని కాలనీ వాసులకు సూచించారు. దొంగతనం కేసులో కీలక ఆధారంగా మారిన సీసీ కెమెరా ఏర్పాటు చేసిన ఇంటి యజమాని సత్యనారాయణను ఏసీపీ అభినందించి సన్మానించారు. దొంగతనానికి గురైన బంగారాన్ని ఇంత త్వరగా తమకు అప్పగించిన అమీన్ పూర్ పోలీసులకు బాధితులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కష్టపడి సంపాదించి దాచుకున్న బంగారం దొంగతనం కావడంతో మా ఆశలన్నీ నీరుగారిపోయాయని, రాదు అనుకున్న బంగారం తిరిగి తెప్పించిన పోలీసుల పనితీరుకు బాధితుల తో పాటు కాలనీల వాసులందరూ హాట్సప్ తెలుపుతున్నారు. 15 రోజుల్లోపు కాలనీలో అన్ని సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటామని హామీనిచ్చారు.

# గంజాయి కట్టడికి కోదాడలో స్పెషల్ డ్రైవ్: నార్కోటిక్ జాగిలాలతో అనుమానస్పద ప్రాంతాల్లో తనిఖీలు

## పోలీసుల ముమ్మర తనిఖీలు.. మత్తు పదార్థాల రవాణాపై ఉక్కు పాదం....పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ శివ శంకర్



**సూర్యాపేట, నేటిధాత్రి:** సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ ఆదేశాల మేరకు కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో నార్కోటిక్ డాగ్ రోలెక్స్ సహాయంతో కోదాడ పట్టణ పోలీసు సిబ్బంది పట్టణంలో రంగా థియేటర్ చౌరస్తా, నుండి ఖమ్మం క్రాస్ రోడ్ చౌరస్తా బస్టాండ్ ప్రాంతాలలో పాన్ షాప్స్, టి కోట్లు, కూరగాయల దుకాణాలు, మార్కెట్, మందుల షాపులు, రద్దీ ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించడం జరిగిందని కోదాడ పట్టణ ఇన్స్పెక్టర్ శివ శంకర్ తెలిపారు. మత్తు పదార్థాల అమ్మకం, కొనుగోలు, రవాణా మరియు వినియోగం జరగకుండా నిరోధించేందుకు ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. అదేవిధంగా పాన్ షాపులు, కిరాణా దుకాణాల యజమానులు మైనర్ పిల్లలకు ఎలాంటి టొబాకో ఉత్పత్తులు, గుట్కా, సిగరెట్లు విక్రయించరాదని స్పష్టమైన సూచనలు ఇవ్వడం జరిగింది. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాలు ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా కుటుంబాలను మరియు సమాజాన్ని కూడా నాశనం చేసే ప్రమాదకరమైన వ్యసనమని తెలిపారు. జిల్లాలో మత్తు పదార్థాల నిర్మూలనకు పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు కొనసాగిస్తోందని, ప్రజలు కూడా అనుమానాస్పద వ్యక్తులు లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

# ధాన్యం నిల్వ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి



## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, నేటిధాత్రి:** కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యం తరలింపు, నిల్వ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదామును బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ మండల తహసిల్దార్ కృష్ణ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేస్తుందని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యం దెబ్బతినకుండా కేటాయించిన ప్రకారం గోదాములు, రైస్ మిల్లులకు తరలించడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో గోదాములకు వచ్చే ధాన్యాన్ని త్వరగా దిగుమతి చేసుకొని నిబంధనల ప్రకారం నిల్వ చేయాలని తెలిపారు. రైస్ మిల్లర్లు తమకు నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం బెల్లంపల్లి మండల



కేంద్రంలో గల సింగరేణి క్లబ్, బూదకలాన్ గ్రామంలో గల సింగరేణి క్లబ్ లను సందర్శించి ధాన్యం నిల్వకు గల అవకాశాలను పరిశీలించారు. సింగరేణి క్లబ్ లలో ధాన్యం నిల్వ చేసేందుకు అవసరమైన అనుమతులు పొందాలని అధికారులకు సూచించారు. ఆర్ అండ్ ఆర్ కాలనీలో గల కమ్యూనిటీ హాల్ ను కాసిపేట మండల తహసిల్దార్ సునీల్ దేశ్ పాండే తో కలిసి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం జిల్లాలోని భీమారం మండల కేంద్రంలో గల సమత రైస్ మిల్లును మండల తహసిల్దార్ సదానందం తో కలిసి పరిశీలించి ధాన్యం దిగుమతి వేగవంతం చేయాలని నిర్వాహకులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల నుండి తరలించిన ధాన్యం దిగుమతి వేగంగా చేసుకోవాలని, అవసరమైన మేరకు హమాలీల సంఖ్య పెంపొందించుకోవాలని తెలిపారు. రైస్ మిల్లులకు నిర్దేశించిన సి.ఎం.ఆర్. లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి



**భూపాలపల్లి, నేటిధాత్రి:** నిరుద్యోగ యువతీ యువకులు జాబ్ మేళాలను సద్వినియోగపరుచుకొని ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆకాంక్షించారు. శనివారం ఐడిఓసి కార్యాలయ సమావేశపు హాలులో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన మెగా జాబ్ మేళాలో ఉద్యోగాలు సాధించిన యువతీ యువకులకు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. అనంతరం ప్రజా పాలన ప్రతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన క్రీడా పోటీలలో ప్రతిభ కనబరిచిన పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులకు మెమొంటోలను బహూకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా నుండి జాబ్ మేళా ద్వారా 43 మంది యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశాలు లభించాలని ఆయన పేర్కొన్నారు. క్రీడాకారులలో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు సీఎం కప్ క్రీడా పోటీలు ఎంతో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. సీఎం కప్ క్రీడా పోటీలలో విద్యార్థులు ప్రతిభ కనబరచడం చాలా సంతోషమని అన్నారు. నేటి విద్యార్థులు రేపటి క్రీడాకారులుగా ఎదగాలని తద్వారా మన జిల్లాకు, రాష్ట్రానికి క్రీడల్లో మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆకాంక్షించారు. పర్యాటక శాఖ ద్వారా నిర్వహించిన క్లీన్ డే ప్రోగ్రాం లో భాగంగా కోటగుళ్లు పరిసరాలను పరిశుభ్రం చేసిన క్రీడాకారులు ఆర్కియాలజీ డైరెక్టర్ బుజ్జి, సెక్యూరిటీ రాజు, సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రవీందర్ తదితరులను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి రఘు, సిబ్బంది సాగర్, యువతీ యువకులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నియామకాల్లో అక్రమాలపై ఎడ్యుకేషనల్ జీఎంకు ఫిర్యాదు



**మంచిర్యాల, నేటిధాత్రి:** సింగరేణి విద్యాసంస్థల్లో ఇటీవల నిర్వహించిన జూనియర్ అసిస్టెంట్ కాంట్రాక్ట్ ఉద్యోగాల ఎంపికలో అక్రమాలు జరిగాయని, మెరిట్ అభ్యర్థులకు అన్యాయం చేశారని శ్రీరాంపూర్‌కు చెందిన ఎస్. స్వాతి అనే అభ్యర్థిని శనివారం కొత్తగూడెం ఎడ్యుకేషనల్ జీఎంకు ఫిర్యాదు చేశారు. సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి కుమార్తె అయిన తనకు 16 ఏళ్ల సర్వీస్ అనుభవం ఉందని, ఈ నెల 21న జరిగిన ఎంపిక ప్రక్రియలో మొదటి విడతలో 70 మార్కులకు గాను తనకు అత్యధికంగా 52.3 శాతం మార్కులు వచ్చాయని పేర్కొన్నారు. అయితే స్థానిక హెచ్‌ఎం, కరస్పాండెంట్, శ్రీరాంపూర్ విద్యాశాఖ అధికారులు చేతులు మార్చి, మిగిలిన 30 మార్కుల కేటాయింపులో తనకు కేవలం 10 మార్కులే వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అదే సమయంలో మెరిట్‌లో వెనుకబడిన (42.5%, 37%) ఇతర అభ్యర్థులకు ఏకంగా 28.5, 26 మార్కులు కేటాయించి లబ్ధి చేకూర్చారని ఆరోపించారు. ఈ నియామక ప్రక్రియపై సమగ్ర విచారణ జరిపి, తనకు న్యాయం చేయాలని ఆమె డిమాండ్ చేశారు.



# నేటిధాత్రి 9 NETI DHATHRI

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా
"నేటిధాత్రి 9" యూట్యూబ్ ఛానల్ లో పనిచేయుటకు
ఆసక్తి కలిగిన కెమెరామెన్లు, రిపోర్టర్లకు

# ఆహ్వానం



పత్రికా రంగంలో "23 వసంతాల" అనుభవం
కలిగిన "నేటిధాత్రి" తెలుగు వార్త పత్రిక ఆధ్వర్యంలో
ఇప్పుడు "నేటిధాత్రి 9" యూట్యూబ్ ఛానల్‌ని
"పాఠక దేవుళ్ళ కోసం " " శక్తి బ్రాడ్ కాస్టింగ్స్ " ద్వారా
మీ ముందుకు తీసుకు వస్తున్నామని తెలుపుటక సంతోషిస్తున్నాము.

"నేటిధాత్రి" పత్రికను ఆదరించిన
విధంగానే "నేటిధాత్రి 9"
" యూట్యూబ్ ఛానల్ " కూడా
ఆదరిస్తారని కోరుకుంటూ....



మీ
కట్టా శివ సుబ్రహ్మణ్యం
సీఈఓ నేటిధాత్రి డిజిటల్ మీడియా
8520007444

మీ
కట్టా రాఘవేందర్ రావ్
సీఈఓ నేటిధాత్రి దినపత్రిక
8297779999

## సంప్రదించవలసిన చిరునామా..

**Srinivasa Nilayam 3rd Floor UBI Colony Road no: 03**
**Near TV9 Office Banjara Hills Hyderabad Pin Code : 500034**




మీ
కట్టా శివ సుబ్రహ్మణ్యం
సీఈఓ నేటిధాత్రి డిజిటల్ మీడియా
8520007444

22ND ANNIVERSARY

"నేటిధాత్రి" 22వ వసంతపు తోరణం

చరిత్రను చెప్పాలన్నా , ఆ చరిత్రను నిక్షిప్తం చేయాలన్నా కావాల్సింది "అక్షరం"

"నేటిధాత్రి" అక్షర ప్రయాణంలో "21 మైలు రాళ్ళు " దాటుకొని ముందుకు సాగుతూ , తెలుగు రాష్ట్రాల గుండెను నింపుకొని , తడి ఆరని అక్షరాలు మోసుకుంటూ
పత్రికా ప్రయాణం సాగిస్తూ "22 వ వసంతం" లోకి దిగ్విజయంగా అడుగిడుతుందని సగర్వంగా చెబుతున్నాము.
"నేటిధాత్రి" అక్షర ప్రయాణంలో మీరు ఇప్పటివరకు అందించిన , అందిస్తున్న సహాయ , సహకారాలు మునుముందు కూడా ఇలాగే కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ....



మీ
కట్టా రాఘవేందర్ రావ్
సీఈఓ నేటిధాత్రి దినపత్రిక
9908658888, 8297779999








## ఎఐతో నకిలీ బికినీ ఫోటోలు

### నెట్టింట వైరల్ కావడంపై నటి రుక్మిణీ ఆగ్రహం

'సప్త సాగరాలు దాటి' సినిమాతో తెలుగు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్న కన్నడ నటి రుక్మిణి వసంత్‌కు సంబంధించిన కొన్ని బికినీ ఫోటోషూట్ క్లిప్స్ సోషల్ మీడియాలో విపరీతంగా కనిపించడంపై నటి రుక్మిణి వసంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు.


గ్రీన్ కలర్ బికినీ ధరించి ఆమె స్విమ్మింగ్ పూల్‌లోకి దిగుతున్నట్లు ఉన్న ఈ విజువల్స్ నెటిజన్లను ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురిచేశాయి. చుట్టూ కెమెరాలు, టెక్నీషియన్లు ఉండటంతో ఇది ఏదైనా అధికారిక షూట్ అయ్యి ఉంటుందని కొందరు భావించగా, మరికొందరు మాత్రం ఇది ఏఐ డీప్‌ఫేక్ అయ్యి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తం చేశారు.

అయితే ఈ వివాదంపై తాజాగా నటి రుక్మిణి వసంత్ అధికారికంగా స్పందిస్తూ ప్రకటన విడుదల చేశారు. ఇంటర్నెట్‌లో తన పేరిట సర్క్యులేట్ అవుతున్న బికినీ చిత్రాలన్నీ పూర్తిగా ఎఐ ద్వారా సృష్టించిన నకిలీ ఫోటోలని ఆమె స్పష్టం చేశారు.

ఆ చిత్రాలు పూర్తిగా తప్పుడు సమాచారంతో, కల్పితంగా సృష్టించబడినవని ఆమె పేర్కొన్నారు. బాధ్యతారాహిత్యంగా ఇతరుల వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగిస్తూ ఇటువంటి మార్ఫింగ్ కంటెంట్‌ను తయారు చేయడం, వాటిని వైరల్ చేయడం తీవ్రమైన నేరమని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారాన్ని తన టీమ్ చాలా తీవ్రంగా పరిగణిస్తోందని, ఈ ఫోటోలను సృష్టించిన వారిపై, అలాగే వీటిని సోషల్ మీడియాలో షేర్ చేస్తూ ప్రచారం కల్పిస్తున్న వారిపై సైబర్ క్రైమ్ విభాగంలో ఫిర్యాదు చేసి కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోబోతున్నట్లు రుక్మిణి వెల్లడించారు.

నెటిజన్లు ఎవరూ కూడా ఇటువంటి నకిలీ కంటెంట్‌ను ఇతరులకు షేర్ చేయవద్దని, వాటిని ప్రోత్సహించవద్దని ఆమె ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

## పెద్ది విజయంపైనే రామ్‌చరణ్ ఆశలు







### బుచ్చిబాబు దర్శకత్వానికి కూడా సవాలే

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్... ఆర్ఆర్ఆర్ తర్వాత గ్లోబల్ స్టార్‌గా ఎదిగిన ఆయనకు అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు లభించింది. అయితే ఆ తరువాత వచ్చిన సినిమాలు మాత్రం ఆశించిన స్థాయిలో విజయాలు అందుకోలేకపోయాయి.

దీంతో ఇప్పుడు చరణ్ కెరీర్‌లో రాబోయే రెండు ప్రాజెక్టులు అత్యంత కీలకంగా మారాయి. ఆచార్యలో కీలక పాత్ర పోషించినప్పటికీ ఆ చిత్రం ప్రేక్షకులను ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది.

అనంతరం భారీ అంచనాల మధ్య విడుదలైన గేమ్ ఛేంజర్ కూడా బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేకపోయింది. స్టార్ దర్శకుడు, భారీ బడ్జెట్, భారీ తారాగణం ఉన్నప్పటికీ సినిమా ప్రేక్షకుల అంచనాలను పూర్తిగా అందుకోలేకపోయింది.

దీంతో ఇప్పుడు అభిమానుల ఆశలన్నీ చరణ్ తదుపరి చిత్రం 'పెద్ది'పై నిలిచాయి. దర్శకుడు బుచ్చిబాబు సనా తెరకెక్కిస్తున్న ఈ చిత్రం గ్రామీణ నేపథ్యంలో సాగే స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోంది.

ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్, గ్లింప్స్, పాటలు, టీజర్‌లకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. ముఖ్యంగా చరణ్ మాస్ లుక్, రగ్గడ్ బాడీ లాంగ్వేజ్ అభిమానులను ఆకట్టుకుంటున్నాయి.

## 200 కోట్లు రాబట్టిన 'కరుప్పు'

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, స్టార్ హీరోయిన్ త్రిష జంటగా నటించిన తాజా చిత్రం 'కరుప్పు', తెలుగులో 'వీరభద్రుడు' బాక్సాఫీస్ వద్ద విజయపరంపర కొనసాగిస్తోంది.

విడుదలైన కొద్ది రోజులకే ఈ సినిమా భారీ వసూళ్లు నమోదు చేస్తూ కొత్త రికార్డులను సృష్టిస్తోంది. ప్రేక్షకుల నుంచి వస్తున్న విశేష స్పందనతో ఈ చిత్రం తమిళ చిత్ర పరిశ్రమలో హాట్ టాపిక్‌గా మారింది.

విడుదలైన వారం రోజుల్లోనే 'కరుప్పు' ప్రపంచవ్యాప్తంగా రూ.200 కోట్ల క్లబ్‌లో చేరి సంచలనం సృష్టించింది. ముఖ్యంగా తమిళనాడులో ఈ సినిమా సాధించిన వసూళ్లు ఇప్పుడు సినీ వర్గాల్లో ప్రత్యేక చర్చకు కారణమయ్యాయి.

గత తొమ్మిది నెలలుగా తమిళనాడులో ఏ సినిమా అందుకోలేని అరుదైన ఘనతను 'కరుప్పు' సాధించింది. కేవలం తమిళనాడు రాష్ట్రంలోనే రూ.100 కోట్ల మార్క్‌ను దాటిన చిత్రంగా నిలిచింది. ఈ చిత్రాన్ని పంపిణీ చేసిన డిస్ట్రిబ్యూషన్ వర్గాలు కూడా ఈ విజయంపై ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా రూ.200 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు నమోదు చేసినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి.

ఈ కలెక్షన్లలో ప్రధానంగా తమిళ వెర్షన్ నుంచే అధిక ఆదాయం



వచ్చినప్పటికీ, తెలుగులో 'వీరభద్రుడు' పేరుతో విడుదలైన సినిమా కూడా మంచి ఆదరణ పొందుతోంది.




## నాగార్జునకు మే 23 స్పెషల్

### తొలి చిత్రం 'విక్రమ్' విడుదలై 40 ఏళ్లు

తన జీవితంలో 'మే 23' ఎప్పటికీ ప్రత్యేకమేనని అగ్ర కథానాయకుడు నాగార్జున అన్నారు. అందులోనూ ఈ ఏడాది మరీ స్పెషల్ అని తెలిపారు. తన మొదటి చిత్రం 'విక్రమ్' విడుదలై నేటికి 40 ఏళ్లు అయిన సందర్భంగా ఆయన పోస్ట్ పెట్టారు. తనను ఆదరిస్తున్న అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. "అందరికీ ధన్యవాదాలు. మే 23.. నేను ఎప్పటికీ మర్చిపోలేని రోజు. మా నాన్న చివరి చిత్రం 'మనం' 2014లో ఇదే రోజు విడుదలైంది. నాన్నతో పాటు నాగచైతన్య, అఖిల్‌లతో నటించే అవకాశం ఆ సినిమాతోనే దక్కింది.

ఇక 40 ఏళ్ల క్రితం ఇదే రోజు నా మొదటి చిత్రం 'విక్రమ్' విడుదలైంది. మిమ్మల్ని అలరించడం కోసం, మీ ప్రేమాభిమానాలు పొందడం కోసం నేను ఇండస్ట్రీకి వచ్చాను. 'విక్రమ్' నాకు ఎంతోమంది అభిమానులను దగ్గర చేసింది. ఇన్నేళ్లుగా నాకు అండగా నిలిచిన అభిమానులందరికీ నా కృతజ్ఞతలు. భవిష్యత్తులో మరిన్ని మే 23లను ఇలానే సెలబ్రేట్ చేసుకోవాలని కోరుకుంటున్నా" అని నాగార్జున తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

నాగార్జున హీరోగా మధుసూధనరావు తెరకెక్కించిన చిత్రం 'విక్రమ్' 1986 మే 23న విడుదలై విజయాన్ని అందుకుంది. 1983లో బాలీవుడ్‌లో విడుదలైన 'హీరో' సినిమాకు రీమేక్‌గా రూపొందింది. ప్రస్తుతం కింగ్ తన 100వ సినిమాతో బిజీగా ఉన్నారు. తమిళ దర్శకుడు రా. కార్తీక్ తెరకెక్కిస్తున్నారు. 'కింగ్ 100' అనే వర్కింగ్ టైటిల్‌తో ప్రచారంలో ఉంది. నాగార్జున ఇందులో పలు రకాల గెటప్‌లలో కనిపిస్తారని, ఆయన పేరు చెప్పగానే 'శివ', 'రక్షకుడు'తో పాటు 'కూలీ'లో పోషించిన సైమన్ లాంటి స్టైలిష్ పాత్రలు గుర్తొస్తాయని, వాటన్నింటినీ గుర్తుచేసేలా 'కింగ్ 100' ఉంటుందని దర్శకుడు ఇటీవల తెలిపారు.

## అఖిల్ 'లెనిన్' టీజర్ విడుదల




### అక్కినేని అభిమానుల్లో ఉత్సాహం

అక్కినేని అఖిల్ హీరోగా తెరకెక్కుతున్న తాజా చిత్రం 'లెనిన్'పై ప్రేక్షకుల్లో ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోంది. యువ దర్శకుడు మురళీకిశోర్ అబ్బూరు దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తోంది.

ఇప్పటికే సినిమా అనౌన్స్‌మెంట్‌తో మంచి అంచనాలు ఏర్పడగా, తాజాగా విడుదలైన టీజర్ సినిమాపై మరింత హైప్ తీసుకొచ్చింది. ఈ సినిమా జూన్ 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసింది.

మరోవైపు అక్కినేని నాగార్జున సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టి 40 ఏళ్లు పూర్తి చేసుకున్న ప్రత్యేక సందర్భంగా, 'లెనిన్' టీజర్‌ను విడుదల చేయడం అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది. విడుదలైన టీజర్‌లో అఖిల్ స్టైలిష్ లుక్‌తో పాటు మాస్ ఎలిమెంట్స్ కూడా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఆయన చెప్పిన డైలాగులు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. "మనోడు వస్తున్నాడా? నేను తప్పిపోయి రాలేదు.. మీ అందరినీ వెతుక్కుంటూ వచ్చా" అంటూ అఖిల్ చెప్పిన డైలాగులు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి. ఈ డైలాగుల్లో కనిపించిన యాటిట్యూడ్, స్క్రీన్ ప్రెజెన్స్ అభిమానులను ఆకట్టుకుంటున్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇక టీజర్ విడుదలపై నాగార్జున కూడా స్పందించారు. తనకు ఈ టీజర్ ఒక సర్‌ప్రైజ్‌లా అనిపించిందని ఆయన పేర్కొన్నారు. టీజర్ మొత్తం ఎంతో హాయిగా, ఆకట్టుకునేలా అనిపించిందని అభిప్రాయపడ్డారు. మంచి కమ్‌బ్యాక్ కోసం ఎదురుచూస్తున్న ఆయనకు 'లెనిన్' మంచి మైలురాయిగా మారుతుందా అనే ఆసక్తి అభిమానుల్లో కనిపిస్తోంది.

ఇప్పటికే విడుదలైన టీజర్ చూస్తుంటే సినిమాలో యాక్షన్, భావోద్వేగాలు, మాస్ అంశాలు సమపాళ్లలో ఉండబోతున్నట్లు సంకేతాలు కనిపిస్తున్నాయి. దీంతో జూన్ 26న విడుదల కానున్న ఈ సినిమాపై అక్కినేని అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

## అనిరుధ్‌తో లవ్‌లో కావ్య మారన్

### త్వరలోనే వెడ్డింగ్ అంటూ సోషల్ మీడియాలో చక్కర్లు


సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఓనర్ కావ్య మారన్‌కు సోషల్ మీడియాలో ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.

ఐపీఎల్ మ్యాచ్‌ల సమయంలో ఆమె హావభావాలు, రియాక్షన్స్ తరచూ వైరల్ అవుతూ అభిమానుల్లో ప్రత్యేక గుర్తింపును సంపాదించాయి. అభిమానులు ప్రేమగా 'కావ్య పాప' అని పిలుచుకునే ఆమెకు సంబంధించిన ఓ వార్త ప్రస్తుతం సోషల్ మీడియా, సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

కావ్య మారన్ త్వరలోనే వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. అంతేకాదు, ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్‌తో ఆమె పెళ్లి జరగబోతుందనే వార్తలు పెద్ద ఎత్తున వైరల్ అవుతున్నాయి. అయితే ఈ ప్రచారం కొత్తది కాదు. గత ఏడాది నుంచే కావ్య మారన్, అనిరుధ్ మధ్య సాన్నిహిత్యం ఉందంటూ సోషల్ మీడియాలో పుకార్లు వినిపించాయి.

ముఖ్యంగా ఇద్దరూ న్యూయార్క్‌లో కలిసి కనిపించారనే వార్తలు రావడంతో డేటింగ్ రూమర్స్ మరింత ఊపందుకున్నాయి. అప్పటి నుంచి వీరిద్దరి గురించి అనేక కథనాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.

ఇప్పుడు మరోసారి కొత్త ప్రచారం తెరపైకి వచ్చింది. కొన్ని మీడియా కథనాల ప్రకారం, ఇరువురి కుటుంబ సభ్యులు ఈ వివాహానికి అంగీకారం తెలిపారని,



విదేశాల్లో వివాహం జరిపించే అవకాశాలపై చర్చలు జరుగుతున్నాయని సమాచారం.

వివాహం అనంతరం చెన్నైలో ఘనంగా రిసెప్షన్ నిర్వహించే ఏర్పాట్లు కూడా జరుగుతున్నాయనే ప్రచారం నడుస్తోంది.

ఆరోగ్య ధాత్రి

# పచ్చిగా తింటేనే మంచి



ఆరోగ్యంపై శ్రద్ధ చూపేవారు అనేక రకాల కూరగాయలను డైట్‌లో భాగం చేసుకుంటారు. రకరకాల కూరలు వండుకొని తింటుంటారు. అయితే, వంట చేసేక్రమంలో.. కొన్ని కూరగాయల్లో పోషకాలు తగ్గుతాయని నిపుణులు చెబుతున్నారు. అలాంటి వాటిని పచ్చిగా తినడమే మంచిదని సలహా ఇస్తున్నారు.



రెడ్ బెల్‌పెప్పర్‌లో విటమిన్ సి సమృద్ధిగా లభిస్తుంది. అయితే, అధిక వేడికి గురైనప్పుడు ఇందులోని ఆస్కార్బిక్ ఆమ్లం స్థాయిలు గణనీయంగా పడిపోతాయి. ఉడకబెట్టినా, ఆవిరి చేసినా.. పోషకాలన్నిటినీ కోల్పోతుంది.



అందుకే, రెడ్ బెల్‌పెప్పర్‌ను పచ్చిగా తిన్నప్పుడే.. ఇందులోని విటమిన్ సి గరిష్ఠస్థాయిలో లభిస్తుంది. ఇతర కెరోటినాయిడ్లు, పాలీఫెనాల్స్ కూడా శరీరానికి అందుతాయి. రెడ్ బెల్‌పెప్పర్స్‌ను సలాడ్ రూపంలో తీసుకోవడమే మంచిది.

బ్రొకోలీలో యాంటి ఇన్‌ఫ్లమేటరీ, కీమోప్రొటెక్టివ్ లక్షణాలు కలిగిన 'మైరోసినేస్' అనే ఎంజైమ్ ఉంటుంది. అధిక వేడిలో ఈ ఎంజైమ్ నిష్క్రియంగా మారిపోతుంది. దాంతో, శరీరానికి బ్రొకోలీ సుగుణాలు అందకుండా పోతాయి. వండిన బ్రొకోలీతో పోలిస్తే.. పచ్చిదాంట్లోనే 10 రెట్లు ఎక్కువగా సల్ఫోరాఫేన్ అనే యాంటి ఆక్సిడెంట్ లభిస్తుంది.

వెల్లుల్లిలో యాంటి ఆక్సిడెంట్లు, సల్ఫ్యూరిక్ సమ్మేళనాలు అధికంగా లభిస్తాయి. ఇవి శరీరానికి అనేక ప్రయోజనాలు అందిస్తాయి. అయితే,



వెల్లుల్లిని వేడి చేయడం వల్ల.. ఇందులోని అల్లిసిన్, ఆర్గానోసల్ఫర్ సమ్మేళనాలు పాక్షికంగా నాశనం అవుతాయి. కాబట్టి వెల్లుల్లి పూర్తి ప్రయోజనాలు అందాలంటే.. దీనిని పచ్చిగా తినడమే మంచిది. అయితే, పచ్చి వెల్లుల్లి కొంతమందిలో కడుపుని చికాకు పెడుతుంది. కాబట్టి, తీసుకునే ముందు నిపుణులను సంప్రదించడం అవసరం.

ఎక్కువసేపు వేడి చేసినప్పుడు ఉల్లిపాయల్లోని క్వెర్సెటిన్, సల్ఫర్ సమ్మేళనాలు దెబ్బతింటాయి. సాధారణ వంట

# రోజులో డ్రై ఫ్రూట్స్ ను అసలు ఏ సమయంలో తినాలి..?

## ఎప్పుడు వీటిని తింటే మనకు ఎక్కువ మేలు జరుగుతుంది..?



మనల్ని అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉంచడం కోసం అనేక రకాల పోషకాహారాలు అందుబాటులో ఉన్నాయి. వాటిల్లో డ్రై ఫ్రూట్స్ కూడా ఒకటి. కిస్మిస్‌లు, అంజీర్, ఆలుబుఖర వంటివి డ్రై ఫ్రూట్స్ జాబితాకు చెందుతాయి. అంజీర్, ఆలుబుఖరతోపాటు యాప్రికాట్స్ కూడా మనకు డ్రై ఫ్రూట్స్ రూపంలో అందుబాటులో ఉన్నాయి. ఇవే కాకుండా ఇంకా అనేక డ్రై ఫ్రూట్స్‌ను చాలా మంది తింటుంటారు. డ్రై ఫ్రూట్స్‌ను తినడం వల్ల అనేక లాభాలు కలుగుతాయి. వీటిల్లో అనేక పోషకాలు ఉంటాయి. ఇవి మనకు ఆరోగ్యకరమైన ప్రయోజనాలను అందిస్తాయి. పలు వ్యాధులను నయం చేయడంలోనూ డ్రై ఫ్రూట్స్ మనకు సహాయం చేస్తాయి. అయితే డ్రై ఫ్రూట్స్ ను రోజులో అసలు ఏ సమయంలో తినాలి..? ఎప్పుడు వీటిని తింటే మనకు అధిక శాతం లాభాలు కలుగుతాయి..? అని చాలా మందికి ప్రశ్నలు తలెత్తుతుంటాయి. ఇక ఇందుకు పోషకాహార నిపుణులు సమాధానాలు చెబుతున్నారు.

### ఏ సమయంలో తినాలి..?

డ్రై ఫ్రూట్స్ లలో మన శరీరానికి కావల్సిన పోషకాలు అధికంగా ఉంటాయి. ముఖ్యంగా విటమిన్లు ఎ, బి కాంప్లెక్స్, సితోపాటు పొటాషియం, మెగ్నిషియం, జింక్ వంటి మినరల్స్‌ను మనం డ్రై ఫ్రూట్స్ ద్వారా పొందవచ్చు. ఈ క్రమంలో ఈ పోషకాలు మనకు ఎంతో మేలు చేస్తాయి. పలు వ్యాధులను నయం చేసేందుకు సహాయం చేస్తాయి. అయితే డ్రై ఫ్రూట్స్ ను ఉదయం తింటేనే అధిక మొత్తంలో లాభాలు కలుగుతాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఉదయం వీటిని బ్రేక్ ఫాస్ట్ తోపాటు కలిపి తీసుకోవాలని సూచిస్తున్నారు. దీని వల్ల అధిక మొత్తంలో పోషకాలు, ఆరోగ్యకర ప్రయోజనాలను పొందవచ్చని వారు అంటున్నారు.

### రోజంతా యాక్టివ్‌గా..

రాత్రంతా మన శరీరానికి ఎలాంటి ఆహారం లభించదు. సుమారుగా 10 నుంచి 14 గంటల పాటు శరీరం ఉపవాస దశలో ఉంటుంది. కనుక ఉదయం పూట శరీరానికి పెద్ద ఎత్తున శక్తి అవసరం అవుతుంది. ఈ క్రమంలో డ్రై ఫ్రూట్స్ ను తినడం వల్ల ఆ శక్తిని చాలా వరకు భర్తీ చేయవచ్చు. పైగా ఉదయం నుంచి మనం పనుల్లో యాక్టివ్‌గా ఉంటాం. కొందరు శారీరక శ్రమ కూడా చేస్తుంటారు. కనుక ఉదయం మన శరీరానికి శక్తి అధికంగా అవసరం అవుతుంది. ఇలాంటి సమయంలో డ్రై ఫ్రూట్స్ ను తింటే కావల్సినంత శక్తి లభిస్తుంది. దీంతో రోజంతా యాక్టివ్‌గా ఉంటారు. ఉత్సాహంగా పనిచేస్తారు. నీరసం, అలసట ఉండవు. బద్దకం పోతుంది. కనుక డ్రై ఫ్రూట్స్ ను ఉదయం పూట తింటేనే మంచిదని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు.

### ఇలా కూడా చేయవచ్చు..

అయితే ఉదయం పూట డ్రై ఫ్రూట్స్ ను తినేంత సమయం లేదని భావిస్తే వాటిని మీరు బాక్స్ లో పెట్టుకుని ఆఫీస్‌కు తీసుకెళ్లి తరువాత తినవచ్చు. ఇక అలా కూడా వీలు కావడం లేదని అనుకుంటే సాయంత్రం సమయంలో స్నాక్స్ రూపంలో తినాలి. కానీ ఆ సమయంలో మనకు పెద్దగా శక్తి అవసరం ఉండదు. కనుక డ్రై ఫ్రూట్స్ ను మోతాదుకు కాస్త తక్కువగా తినాలి. ఇలా డ్రై ఫ్రూట్స్ ను తింటే మన శరీరంలో శక్తి స్థాయిలు ఎల్లప్పుడూ అధికంగానే ఉంటాయి. దీంతో నీరసం, అలసట అసలు రావు. ఉత్సాహంగా ఉండి చురుగ్గా పనిచేస్తారు. డ్రై ఫ్రూట్స్ ను ఇలా తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

# రోజూ ఈ ఆహారాలను తినండి.. మీ జుట్టు వేగంగా పెరుగుతుంది.. జుట్టు అసలు రాలదు..

ప్రస్తుతం చాలా మంది అనేక రకాల జుట్టు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. వాటిల్లో జుట్టు రాలడం కూడా ఒకటి. జుట్టు రాలిపోయేందుకు అనేక కారణాలు ఉంటున్నాయి. థైరాయిడ్, ఒత్తిడి, ఆందోళన, కాలుష్యం, దీర్ఘకాలిక వ్యాధులు ఉండడం, మందులను అధికంగా వాడడం వంటి వాటితోపాటు పోషకాహార లోపం వల్ల కూడా ఈ సమస్య వస్తుందని వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం చాలా మంది సరైన ఆహారాలను తినడం లేదు. బయటి ఫుడ్‌ను ఎక్కువగా తింటున్నారు. దీని కారణంగా చాలా మందిలో పోషకాహార లోపం సమస్య తలెత్తుతోంది. ఇది జుట్టు రాలేందుకు కారణం అవుతోంది. అయితే రోజూ మనం తినే ఆహారాల విషయంలో పలు మార్పులు చేసుకుంటే జుట్టు రాలే సమస్యను చాలా సులభంగా తగ్గించుకోవచ్చు. మనం తినే ఆహారాలే మన జుట్టు పెరుగుదలను ప్రభావితం చేస్తాయి. కనుక పోషకాలు ఉండే ఆహారాలను తినాల్సి ఉంటుంది.

### ఆకుకూరలు..

జుట్టు రాలిపోయేందుకు ప్రధాన కారణం మన శరీరంలో తగినంత మోతాదులో మినరల్స్ లేకపోవడమే అని చెప్పవచ్చు. ముఖ్యంగా ఫోలేట్, ఐరన్‌తోపాటు విటమిన్లు ఎ, సి తక్కువగా ఉండడం లేదా లోపం వల్ల జుట్టు రాలిపోతుంది. కనుక ఈ పోషకాలు మనకు లభించేలా చూసుకోవాలి. ఇందుకు గాను రోజూ పాలకూర జ్యూస్‌ను తాగాలి. పాలకూరలో అధికంగా పోషకాలు ఉంటాయి. ఇందులో ఉండే విటమిన్లు ఎ, సి, క్యాల్షియం, ఐరన్, యాంటీ ఆక్సిడెంట్లు జుట్టు పెరుగుదలకు దోహదం చేస్తాయి. కనుక రోజూ పాలకూర జ్యూస్‌ను తాగుతుంటే ఫలితం ఉంటుంది. అలాగే రోజూ దాల్చిన చెక్కను ఆహారంలో భాగం చేసుకుంటే జుట్టు పెరుగుదలకు ఎంతో దోహదం చేస్తుంది. దాల్చిన చెక్క పొడిని మీరు తినే ఆహారాలపై చల్లి తినవచ్చు. లేదా ఈ చెక్కను నీటిలో వేసి మరిగించి తాగవచ్చు. దీని వల్ల కేవలం జుట్టు పెరగడమే కాకుండా షుగర్, కొలెస్ట్రాల్ లెవల్స్ అదుపులో ఉంటాయి.

### గింజలు, విత్తనాలు..

ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉండే గింజలు, విత్తనాలను రోజూ తింటున్నా కూడా ఉపయోగం ఉంటుంది. ముఖ్యంగా బాదంపప్పు, పిస్తా, వాల్ నట్స్, జీడిపప్పు, గుమ్మడి విత్తనాలు, పొద్దు తిరుగుడు విత్తనాలు, అవిసె గింజలు, చియా సీడ్స్‌ను ఆహారంలో భాగం చేసుకోవాలి. వీటిల్లో ఉండే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు జుట్టు పెరుగుదలకు దోహదం చేస్తాయి. అలాగే గుండెను కూడా ఆరోగ్యంగా ఉంచుతాయి. ఈ గింజలు, విత్తనాల్లో విటమిన్ ఇ కూడా అధికంగానే ఉంటుంది. ఇది జుట్టును సంరక్షిస్తుంది. శిరోజాలు పెరిగేలా చేస్తుంది. అలాగే సోయాబీన్ ఉత్పత్తులను తరచూ ఆహారంలో భాగం చేసుకోవాలి. సోయా టోఫు, సోయా పాలు, సోయా గింజలను తీసుకోవాలి. వీటిల్లో ఉండే క్యాల్షియం, ఐరన్, ఇతర పోషకాలు జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తాయి. జుట్టు ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి.

### కోడిగుడ్లు, చేపలు..

రోజూ ఒక కోడిగుడ్డును ఆహారంలో భాగం చేసుకుంటే శరీరానికి బయోటిన్ అధికంగా లభిస్తుంది. ఇది జుట్టు



ఒత్తుగా పెరిగి దృఢంగా, ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. కోడిగుడ్లలో ప్రోటీన్లు, జింక్, సెలీనియం అధిక మొత్తంలో ఉంటాయి. ఇవి కూడా శిరోజాలను సంరక్షిస్తాయి. అలాగే వారంలో కనీసం 2 సార్లు చేపలను తింటున్నా ఉపయోగం ఉంటుంది. వీటిల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు, ఇతర ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రోటీన్లు, విటమిన్ డి ఉంటాయి. ఇవన్నీ జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తాయి. ఇలా ఆయా ఆహారాలను రోజూ తీసుకుంటే జుట్టు రాలడాన్ని తగ్గించుకోవచ్చు. శిరోజాలు ఒత్తుగా పెరిగి దృఢంగా ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే అన్ని పోషకాలు లభించి ఆరోగ్యంగా ఉంటారు. ఇతర అనారోగ్య సమస్యలు రాకుండా అడ్డుకోవచ్చు.

# మీ కనుబొమ్మలు ఒత్తుగా పెరిగి అందంగా కనిపించాలా..?


ముఖం అందంగా కనిపించడంలో కనుబొమ్మలు ముఖ్య పాత్ర పోషిస్తాయని చెప్పవచ్చు. అందమైన, వత్తుగా ఉండే కనుబొమ్మలు ముఖ అందాన్ని పెంచడంలోనే కాకుండా ఆత్మవిశ్వాసాన్ని మెరుగుపరచడంలో కూడా సహాయపడతాయి. కనుబొమ్మలు అందంగా కనిపించడానికి స్త్రీలు ఎంతో ఖర్చు చేస్తారని కూడా చెప్పవచ్చు. అయితే కొందరిలో కనుబొమ్మలు చాలా పలుచగా ఉంటాయి. దీంతో వారు ఆత్మనూన్యత భావనకు గురి అవుతూ ఉంటారు. అలాంటి వారు ఇప్పుడు చెప్పే కొన్ని రకాల ఇంటి చిట్కాలను పాటించడం వల్ల కనుబొమ్మలు ఒత్తుగా, నల్లగా, అందంగా తయారవుతాయి. కనుబొమ్మల అందాన్ని మెరుగుపరిచే చిట్కాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

### ఆముదం నూనె..

కనుబొమ్మలు పలుచగా ఉన్న వారు రోజూ వాటిపై ఆముదం నూనెను రాయడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. ఆముదం నూనెలో విటమిన్లు, ప్రోటీన్లు, కొవ్వు ఆమ్లాలు సమృద్ధిగా ఉంటాయి. ఇది కుదుళ్లు వేగంగా, నల్లగా పెరిగేలా ప్రోత్సహిస్తుంది. దూది లేదా సున్నితమైన బ్రష్ తో రోజూ కనుబొమ్మలపై ఆముదం నూనెను రాయడం వల్ల కనుబొమ్మలు ఒత్తుగా పెరుగుతాయి. అలాగే ఉల్లిపాయలల్లో సల్ఫర్ అధికంగా ఉంటుంది. ఇది కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుతుంది. ఉల్లిపాయ రసాన్ని రోజూ రెండుసార్లు కనుబొమ్మలపై రాసి 15 నుండి 20 నిమిషాల పాటు అలాగే ఉంచాలి. ఇలా చేయడం వల్ల కనుబొమ్మలు అందంగా తయారవుతాయి.

### కలబంద..

కలబంద ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను, సౌందర్య ప్రయోజనాలను అందిస్తుందన్న సంగతి మనకు తెలిసిందే.



దీనిలో విటమిన్లు. ఖనిజాలు ఎక్కువగా ఉంటాయి. జుట్టు పెరుగుదలను ప్రోత్సహించడంలో ఇవి ఎంతగానో సహాయపడతాయి. తాజా కలబంద జెల్ ను కనుబొమ్మలపై రాసి 30 నిమిషాల పాటు అలాగే ఉంచి తరువాత శుభ్రం చేసుకోవాలి. ఇలా రోజూ రెండు సార్లు చేయడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. అదేవిధంగా కొబ్బరి నూనెలో లారిక్ ఆమ్లాలు, విటమిన్లు. ఖనిజాలు ఎక్కువగా ఉంటాయి. ఇది అందరి ఇండ్లల్లోనూ ఉంటుంది. జుట్టు పెరుగుదలకు, ఆరోగ్యానికి ఇది ఎంతో తోడ్పడుతుంది. రోజూ రాత్రి పడుకునే ముందు కనుబొమ్మలపై కొబ్బరి నూనెను రాసుకోవాలి. ఇలా చేయడం వల్ల కనుబొమ్మలు ఒత్తుగా, నల్లగా పెరుగుతాయి.

### రోజ్‌మేరీ నూనె..

రోజ్‌మేరీ నూనెలో యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి వెంట్రుకలకు రక్తప్రసరణను పెంచి అవి వేగంగా పెరిగేలా చేయడంలో తోడ్పడతాయి. కొబ్బరి నూనెలో రోజ్‌మేరీ నూనెను కలిపి కనుబొమ్మలపై సున్నితంగా రాసి మర్దనా చేయాలి. ఇలా చేయడం వల్ల కొన్ని వారాల్లోనే చక్కటి ఫలితాలను పొందవచ్చు.

# కేవలం చపాతీలు మాత్రమే కాదు.. ఈ రొట్టెలను కూడా తరచూ తినండి.. అనేక లాభాలు కలుగుతాయి..!

చపాతీలు.. ఈ పేరు చెప్పగానే మనకు గోధుమ పిండితో చేసే చపాతీలే గుర్తుకు వస్తాయి. చాలా మంది ఈ పిండితోనే చపాతీలను తయారు చేసి తింటారు. చపాతీలు వాస్తవానికి ఎంతో రుచిగా ఉంటాయి. ఏ కూరతో అయినా సరే తినవచ్చు. అధిక బరువు తగ్గాలని చూసేవారు, షుగర్ ఉన్నవారు, ఇతర అనారోగ్య సమస్యలు లేదా వ్యాధులు ఉన్నవారు రాత్రి పూట అన్నం మానేసి చపాతీలను తింటుండడం మనం చూస్తూనే ఉంటాం. అయితే నిజానికి చపాతీలను కేవలం గోధుమ పిండితోనేకాదు, పలు ఇతర చిరుధాన్యాలకు చెందిన పిండిలతోనూ తయారు చేయవచ్చు. అవి కూడా ఎంతో రుచిగా ఉంటాయి. ఆయా పిండిలతో తయారు చేసే చపాతీలను రాత్రి పూట తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు. రోజూ కేవలం గోధుమ పిండితోనే కాకుండా వివిధ రకా చిరు ధాన్యాలతోనూ పిండి తయారు చేసి దాంతో చపాతీలను తయారు చేసి తింటుంటే అనేక లాభాలు కలుగుతాయి. అనేక రకాల పోషకాలను పొందవచ్చు. ఇవి మనల్ని రోగాల నుంచి రక్షిస్తాయి.

### జొన్న రొట్టెలు..

పూర్వం చాలా మంది జొన్న పిండితో రొట్టెలను తయారు చేసే తినేవారు. కానీ ఇప్పుడు ఇలా తినడం తగ్గించేశారు. ఆరోగ్యంపై శ్రద్ధ ఉన్న కొందరు మాత్రం ప్రస్తుతం జొన్న రొట్టెలను తింటున్నారు. జొన్నలను పిండిగా మార్చి వాటితో రొట్టెలను తయారు చేసి రోజూ తింటే అనేక లాభాలు కలుగుతాయి. షుగర్ ఉన్నవారికి ఈ రొట్టెలు ఎంతో మేలు చేస్తాయి. అలాగే బరువు తగ్గేందుకు కూడా సహాయం చేస్తాయి. జొన్నల్లో అనేక పోషకాలు ఉంటాయి. ఇవి మనకు అనేక లాభాలను అందిస్తాయి. జొన్నల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది ఆహారం సులభంగా జీర్ణం అయ్యేలా చేస్తుంది. మలబద్దకాన్ని తగ్గిస్తుంది. జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. అలాగే ఫైబర్ కారణంగా కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. ఇలా జొన్న రొట్టెలతో లాభాలను పొందవచ్చు.

### రాగి రొట్టెలు..

ఇక రాగులతోనూ రొట్టెలను తయారు చేసి తినవచ్చు. రాగి పిండితో వీటిని తయారు చేస్తారు. ఇవి ఎంతో రుచిగా ఉంటాయి. రాగి రొట్టెలను తినడం వల్ల క్యాల్షియం అధిక మొత్తంలో లభిస్తుంది. ఇది దంతాలు, ఎముకలను దృఢంగా



మార్చి ఆరోగ్యంగా ఉంచుతుంది. రాగి రొట్టెలను తింటే ప్రోటీన్లు సమృద్ధిగా లభిస్తాయి. ఇవి శరీరానికి కావల్సిన శక్తిని అందిస్తాయి. మనల్ని యాక్టివ్‌గా ఉండేలా చేస్తాయి. ఉత్సాహంగా ఉంటాము. చురుగ్గా పనిచేస్తాము. నీరసం, అలసట తగ్గుతాయి. బద్దకం పోతుంది. రాగుల్లో ఉండే మెగ్నిషియం కారణంగా కండరాలు ప్రశాంతంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. కండరాల నొప్పులు తగ్గుతాయి. ముఖ్యంగా రాత్రి పూట నిద్రలో కాలి పిక్కలు పట్టుకుపోకుండా ఉంటాయి. అలాగే రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. దీంతో కొలెస్ట్రాల్ తగ్గి గుండె ఆరోగ్యంగా ఉంటుంది. ఇలా రాగి రొట్టెలతో ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి.

### సజ్జ రొట్టెలు..

ఇక రాత్రి పూట తినాల్సిన రొట్టెల్లో సజ్జ రొట్టెలు కూడా ఒకటి. సజ్జలను పిండి మార్చి దాంతో రొట్టెలను తయారు చేయవచ్చు. ఇవి కూడా ఎంతో రుచిగా ఉంటాయి. అనేక లాభాలను అందిస్తాయి. షుగర్ లెవల్స్ అధికంగా ఉన్నవారు ఇతర రొట్టెల కన్నా సజ్జ రొట్టెలను తింటుంటే ఎంతో మేలు జరుగుతుంది. సజ్జల గ్లైసీమిక్ ఇండెక్స్ చాలా తక్కువగా ఉంటుంది. పైగా వీటిల్లో ఫైబర్ ఉంటుంది. కనుక ఈ రొట్టెలను తింటుంటే రక్తంలో చక్కెర స్థాయిలు తగ్గుతాయి. దీని వల్ల షుగర్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. ఇక సజ్జల్లో ఐరన్ అధికంగా ఉంటుంది. దీని వల్ల రక్తం వృద్ధి చెందుతుంది. రక్తహీనత తగ్గుతుంది. అలాగే బరువు తగ్గాలనుకునే వారు రోజూ ఈ రొట్టెలను తింటుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది. ఈ విధంగా సజ్జ రొట్టెలు మనకు మేలు చేస్తాయి. ఇలా రోజూ కేవలం గోధుమ పిండితో చేసే చపాతీలను మాత్రమే కాకుండా, రోజుకో రకం రొట్టెలను తింటుండాలి. దీంతో అన్ని రకాల పోషకాలు లభిస్తాయి. అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉండవచ్చు.

# రోజూ ఉదయం పూట 10 నిమిషాల పాటు యోగా చేస్తే కలిగే అద్భుతమైన లాభాలు ఇవే..!

శరీర ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవడానికి, ఒత్తిడి, ఆందోళన వంటి మానసిక సమస్యలను తగ్గించుకోవడానికి మనం అనేక రకాల వ్యాయామాలు చేస్తూ ఉంటాము. ఇలాంటి వ్యాయామాలల్లో యోగా కూడా ఒకటి. యోగాను ఎవరైనా కూడా చాలా సులభంగా చేయవచ్చు. చిన్న వయసు నుండే పిల్లలకు యోగా చేయడం నేర్పించడం వల్ల వారి ఆరోగ్యంతో పాటు ఏకాగ్రత కూడా పెరుగుతుంది. రోజూ యోగా చేయడం వల్ల మనకు ఎంతో మేలు కలుగుతుంది. ఈ విషయాలను యోగా నిపుణులు తెలియజేస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం 10 నిమిషాల పాటు యోగా చేయడం వల్ల మనకు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి.

### రీసెట్ బటన్‌లాగా..


ఉదయం చేసే ఈ యోగా మనకు ఒక రీసెట్ బటన్ లాగా పనిచేస్తుంది. రోజంతా మనస్సును ప్రశాంతంగా ఉంచుతుంది. పది నిమిషాల పాటు యోగా, శ్వాస వ్యాయామాలు చేయడం వల్ల శరీరం స్థిరంగా ఉంటుంది. మనసు తేలికగా ఉంటుంది. సరళమైన శ్వాస వ్యాయామాలు చేయడం వల్ల ఊపిరితిత్తుల ఆరోగ్యం మెరుగుపడుతుంది. శరీరంలో ఆక్సిజన్ స్థాయిలు మెరుగుపడతాయి. దీంతో శరీర శక్తి స్థాయిలు పెరుగుతాయి. అలాగే రాత్రంతా నిద్రపోవడం వల్ల కండరాలు బిగుతుగా తయారవుతాయి. శరీరం నొప్పులుగా అనిపిస్తుంది. అలాంటి వారు ప్రతిరోజూ యోగా చేయడం వల్ల శరీర నొప్పులు తగ్గుతాయి. రోజూ యోగా చేయడం, సులభమైన ఆసనాలు వేయడం వల్ల మానసికంగా ఉత్సాహంగా తయారవుతారు. సులభంగా నిర్ణయాలు తీసుకోగలుగుతారు. మెదడు పదునుగా తయారవుతుంది.

### ఒత్తిడి హార్మోన్లు..

అంతేకాకుండా ఉదయం పూట ఒత్తిడి హార్మోన్ అయిన కార్టిసాల్ శరీరంలో ఎక్కువగా ఉంటుంది. రోజూ ఉదయం యోగా చేయడం వల్ల ఈ హార్మోన్ స్థాయిలు అదుపులో ఉంటాయి. శరీరం, మనసు ప్రశాంతంగా ఉంటాయి. రోజూ యోగా చేయడం, శరీరాన్ని వంచడం వంటి కొన్ని ఆసనాలు వేయడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. రోజంతా అసౌకర్యం లేకుండా ఉంటుంది.

### వెన్నెముక ఆరోగ్యానికి..

ఉదయం పూట యోగా చేయడం వల్ల వెన్నెముక ఆరోగ్యం మెరుగుపడుతుంది. కూర్చోవడం, నడవడం వంటివి మరింత సహజంగా అనిపిస్తాయి. అలాగే ప్లాంట్ లేదా బోట్ వంటి భంగిమలు చేయడం వల్ల నడుము కింద భాగం ఆరోగ్యం మెరుగుపడుతుంది. రోజూ యోగా చేయడం వల్ల భాగోద్వేగాలు అదుపులో ఉంటాయి. 10 నిమిషాల పాటు యోగా చేయడం వల్ల త్వరగా స్పందించే గుణం తగ్గుతుంది. దీంతో కోపం, ఆందోళన వంటివి తగ్గి ప్రశాంతంగా ఆలోచించే గుణం పెరుగుతుంది. ఈ విధంగా యోగా మన శరీర ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తుందని



# చిన్నారుల అదృశ్యాలపై సుప్రీం తీవ్ర ఆందోళన



## మిస్సింగ్ కేసులు కాదు.. కిడ్నాప్ కోణంలో దర్యాప్తు చేయాలి

న్యూఢిల్లీ, నేటిధాత్రి:
దేశవ్యాప్తంగా నానాటికీ పెరుగుతున్న చిన్నారుల అదృశ్యం కేసులపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రస్తుతం దేశంలో దాదాపు 47,000 మంది చిన్నారుల ఆచూకీ లభించకుండా పోయిందని, ప్రతి ఏటా ఈ బ్యాక్‌లాగ్ పెరుగుతుండటంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ వ్యవస్థాగత లోపాలను సరిదిద్దడానికి, అంతర్రాష్ట్ర మానవ అక్రమ రవాణా ముఠాల నెట్‌వర్క్‌ను ఛేదించేందుకు సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది.
జస్టిస్ అహసానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ఆర్. మహాదేవన్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం.. చిన్నారుల అదృశ్యం కేసులను కేవలం 'మిస్సింగ్' కేసులుగా కాకుండా, అంతర్రాష్ట్ర ముఠాల కిడ్నాప్ కోణంలోనే దర్యాప్తు చేయాలని స్పష్టం చేసింది.

### డేటాబేస్‌ల మధ్య సమన్వయం ఉండాలి

పోలీసుల వద్ద ఉన్న క్రిమినల్ ట్రాకింగ్ డేటాబేస్, చైల్డ్ వెల్ఫేర్ అథారిటీల వద్ద ఉన్న 'మిషన్ వాత్సల్య' డేటాబేస్ మధ్య సరైన సమన్వయం లేకపోవడాన్ని కోర్టు తప్పుపట్టింది. ఈ క్రమంలో సుప్రీంకోర్టు ఐదు కీలక ఆదేశాలను జారీ చేసింది.
దేశంలోని వివిధ సంస్థలు నిర్వహిస్తున్న చిన్నారుల డేటాబేస్‌లన్నింటినీ అనుసంధానం చేయాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖను ఆదేశించింది. దీనివల్ల పోలీస్ అధికారులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు, జిల్లా బాలల రక్షణ విభాగాలు, చైల్డ్ కేర్ హోమ్‌ల మధ్య సమాచారం రియల్ టైమ్‌లో అందుబాటులోకి వస్తుందని పేర్కొంది.

### నాలుగు వారాల్లో యాంటీ ట్రాఫికింగ్ యూనిట్లు పూర్తి స్థాయిలో పనిచేయాలి

దేశంలోని చాలా జిల్లాల్లో మానవ అక్రమ రవాణా నిరోధక విభాగాలు కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయని కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దేశంలోని అన్ని జిల్లాల్లో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్లను (ఏహెచ్‌టీయూ) తగిన అధికారులు, మౌలిక సదుపాయాలతో నాలుగు వారాల్లోగా పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.
ఏదైనా చిన్నారి అదృశ్యమైన వెంటనే అధికారులు దానిని సాధారణ మిస్సింగ్ కేసుగా కాకుండా, కిడ్నాప్ లేదా అపహరణ కోణంలో దర్యాప్తు ప్రారంభించాలని స్పష్టం చేసింది. దీంతో దర్యాప్తులో జాప్యం తగ్గి, కేసుపై మరింత సీరియస్‌గా వ్యవహరించే అవకాశం ఉంటుందని కోర్టు అభిప్రాయపడింది.

### హ్యూమన్ ట్రాఫికింగ్ అనుమానం ఉంటే వెంటనే చర్యలు

ఒకవేళ కేసులో మానవ అక్రమ రవాణా అనుమానాలు ఉంటే, నిబంధనల ప్రకారం నాలుగు నెలలు వేచి చూడకుండా వెంటనే కేసును సంబంధిత విభాగాలకు బదిలీ చేయాలని కోర్టు స్పష్టం చేసింది.
రక్షించిన లేదా గుర్తించిన చిన్నారులను సాధారణంగా 24 గంటల్లోగా వారి కుటుంబాలకు అప్పగించాలని సూచించింది. అయితే చైల్డ్ ట్రాఫికింగ్ లేదా దోపిడీ వెనుక కుటుంబ సభ్యుల ప్రమేయం ఉన్నట్లు అనుమానం ఉంటే, అలాంటి కేసులను చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు పర్యవేక్షించాలని తెలిపింది.

### ప్రతి చిన్నారికి ప్రత్యేక గుర్తింపు ఉండాలి

రక్షించిన ప్రతి చిన్నారికి ప్రత్యేక గుర్తింపు ఉండేలా చూసుకోవాలని, భవిష్యత్తులో వారి ఆచూకీని సులభంగా పర్యవేక్షించేందుకు అవసరమైన అధికారిక రిజిస్ట్రేషన్, వెరిఫికేషన్ ప్రక్రియలను వేగవంతం చేయాలని జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్లకు కోర్టు సూచించింది. తద్వారా ఐడెంటిటీ డూప్లికేషన్‌ను నిరోధించవచ్చని పేర్కొంది.

### చెన్నై చిన్నారి కేసుపై కీలక వ్యాఖ్యలు

2011 సెప్టెంబరులో చెన్నైలోని విరుగంబాక్కం పరిధిలో 'కవిత' అనే చిన్నారి అదృశ్యమైంది. స్థానిక పోలీసులు, సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తు చేసినప్పటికీ ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో కేసును ఆచూకీ లభించనిదిగా పేర్కొంటూ పోలీసులు క్లోజర్ రిపోర్ట్ సమర్పించారు.
దీనిపై చిన్నారి తండ్రి జి. గణేష్ దాఖలు చేసిన పిటిషన్‌ను 2025 మార్చిలో మద్రాస్ హైకోర్టు తిరస్కరించింది. చిన్నారి 2011లో మిస్ అయిందని, 2013లో వచ్చిన హోం శాఖ యాంటీ ట్రాఫికింగ్ మార్గదర్శకాలు దీనికి వర్తించవని హైకోర్టు పేర్కొంది. ఈ తీర్పును సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. "చిన్నారి ఆచూకీ లభించనంతకాలం చైల్డ్ ప్రొటెక్షన్ గైడ్‌లైన్స్, యాంటీ ట్రాఫికింగ్ ప్రోటోకాల్స్ అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుంది" అని స్పష్టం చేసింది. ఈ కేసును సుమోటోగా స్వీకరించిన సుప్రీంకోర్టు, దేశవ్యాప్తంగా ఉన్న మిస్సింగ్ చిన్నారుల సమస్యపై సమగ్ర ఆదేశాలు జారీ చేసింది. కేసు తదుపరి విచారణను ఆగస్టుకు వాయిదా వేసింది. అప్పటిలోగా అన్ని రాష్ట్రాలు, సంబంధిత అధికారులు తమ నివేదికలను సమర్పించాలని ఆదేశించింది.

# పెద్ది రిలీజ్‌కు పర్సంటేజ్ కండీషన్!



## -పర్సంటేజ్ విధానం లేకుంటే విడుదలకు సహకారం లేదన్న అసోసియేషన్



హైదరాబాద్, నేటిధాత్రి:
తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. పెద్ది సినిమా విడుదల చేయాలంటే తమకు పర్సెంటేజ్ ఇవ్వాల్సిందేనని స్పష్టం చేసింది. ఇకపై ఏ సినిమా అయినా పర్సంటేజ్ కావాలని తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ తేల్చి చెప్పింది. శనివారం తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ సభ్యులు మీడియాతో మాట్లాడుతూ.. 'తెలుగు ఫిల్మ్ ఛాంబర్ కమిటీతో రెండు, మూడు సార్లు చర్చలు జరిగాయి. హరిహర వీరమల్లు రిలీజ్ సమయంలో.. రెండు నెలల్లో మా సమస్యను పరిష్కరిస్తామని అన్నారు'..
'కానీ, సంవత్సరం గడిచిపోయింది. పెద్ది సినిమాకు మాకు పర్సంటేజ్ కావాల్సిందే. మమ్మల్ని నిర్మాతలు రెచ్చగొడుతున్నారు. మొదట మూడు వారాలు అన్నారు.. ఇప్పుడు ఆరు వారాలు అంటున్నారు. పర్సెంటేజ్ సిస్టమ్ అయితేనే సినిమాలు ఆడిస్తాము. 120 మంది థియేటర్స్ ఓనర్లు దీనస్థితిలో ఉన్నారు. పర్సంటేజ్ సిస్టంను కావాలనే నిర్మాతలు లేట్ చేస్తున్నారు. మాకు పర్సెంటేజ్ విధానం కావాల్సిందే. అది ఎంత ఇస్తారో చెప్పండి. 10,15 ఏళ్ల కింద థియేటర్స్‌కి మంచి రెవెన్యూ ఉండేది. ఇప్పుడు ఎగ్జిబిటర్స్‌కి రెవెన్యూ రావడం లేదు. కానీ, నిర్మాతలకు 14 రకాలుగా ఆదాయం వస్తోంది'..
'పర్సంటేజ్ విధానం కొత్త విషయం కాదు. అన్ని రాష్ట్రాల్లో ఇప్పటికే ఉంది. కాబట్టి కూర్చుని పర్సంటేజ్‌ను తేల్చండి. అన్ని సినిమాల రిలీజ్ సాఫీగా జరుగుతుంది. మీటింగ్‌లో కూడా పర్సంటేజ్‌కు సైన్ చేస్తేనే పెద్ది రిలీజ్‌కు ఒప్పుకుంటామని చెప్పాము. సబ్ కమిటీలో మెంబర్స్‌గా ఉండి.. మాకు కావలసిన పర్సంటేజ్‌ను సాధించుకుంటాం. మెగాస్టార్ చిరంజీవి పిలిస్తే వెళతాం. పెద్దమనిషికి మా బాధలు చెప్పుకుంటాం. పర్సంటేజ్ సిస్టమే ఉండాలి. రెంటల్ మాట వద్దు' అని అన్నారు.

# తెలంగాణలో ఎండలపై హై అలర్ట్




హైదరాబాద్, నేటిధాత్రి:
రాష్ట్రవ్యాప్తంగా హీట్‌వేవ్ పరిస్థితులపై హై అలర్ట్ ప్రకటించినట్లు తెలంగాణ రెవెన్యూ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. తీవ్ర ఉష్ణోగ్రతల పరిస్థితులపై మంత్రి పొంగులేటి సచివాలయంలో శనివారం అత్యవసర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై మంత్రి దిశానిర్దేశం చేశారు.
వడగాల్పుల కారణంగా రాష్ట్రంలోని ఏడు జిల్లాల్లో 16 మంది మృతి చెందినట్లు తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందజేస్తున్నట్లు ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు నష్టపరిహారం ఇస్తున్నామని స్పష్టం చేశారు.
రాబోయే మూడు రోజులు రాష్ట్రంలో హీట్‌వేవ్ పరిస్థితులు మరింత తీవ్రంగా ఉండే అవకాశం ఉందని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని మార్గనిర్దేశం చేశారు. ప్రజల ప్రాణరక్షణ తమ ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని పేర్కొన్నారు. వడగాల్పుల కారణంగా ఒక్క ప్రాణం కూడా కోల్పోకూడదని స్పష్టం చేశారు.
ఎండల తీవ్రతపై ప్రజలకు గంట గంటకు హెచ్చరికలు జారీ చేస్తున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రజలు అత్యవసర పరిస్థితులు మినహా బయటకు రావొద్దని సూచించారు. వృద్ధులు, గర్భిణులు, చిన్నారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.
వ్యవసాయ, భవన నిర్మాణ కార్మికులకు ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. హీట్‌వేవ్‌పై గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఎండదెబ్బకు గురైన వారికి ఆయా ఆస్పత్రుల్లో తక్షణ అత్యవసర చికిత్స అందించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

### రాష్ట్రంలో భానుడి భగభగలు

ఇదిలావుంటే తెలంగాణలో భానుడి భగభగలు తీవ్రరూపం దాల్చాయి. రాష్ట్రవ్యాప్తంగా ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతుండగా, 18కు పైగా జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 46 డిగ్రీల సెల్సియస్‌ను దాటాయి. పరిస్థితి తీవ్రంగా మారడంతో అధికారులు 18 జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. హైదరాబాద్‌లో కూడా ఉష్ణోగ్రతలు భారీగా పెరిగి 43 డిగ్రీలకుపైగా నమోదయ్యాయి. రాష్ట్రంలోని ఉత్తర, తూర్పు జిల్లాలు తీవ్ర వడగాలుల ప్రభావానికి గురవుతున్నాయి. వడదెబ్బ ప్రభావం ఆందోళనకరంగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా వడదెబ్బ కారణంగా 34 మంది ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు.

### వడదెబ్బ లక్షణాలు.. తీసుకోవాల్సిన జాగ్రత్తలు

అధిక ఉష్ణోగ్రతల కారణంగా అలసట, శరీర బలహీనత వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉండటం వల్ల మరింత అలసటగా అనిపించవచ్చు. కండరాల నొప్పులు వచ్చే అవకాశం ఉంది. హీట్ ఇంజురీ కారణంగా శరీర భాగాలు దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. కిడ్నీ, గుండె సంబంధిత సమస్యలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. హీట్ స్ట్రోక్ తీవ్రమైన సమస్య. ఈ పరిస్థితిలో శరీర భాగాలు తీవ్రంగా దెబ్బతింటాయి. దీని కారణంగా మెదడు పనితీరు దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. స్ట్రోక్ సంభవించే అవకాశమూ ఉంది. దీన్ని నిర్లక్ష్యం చేస్తే కోమాలోకి వెళ్లే ప్రమాదం కూడా ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.
వడదెబ్బ నుంచి తప్పించుకోవాలంటే శరీరాన్ని ఎప్పుడూ హైడ్రేట్‌గా ఉంచుకోవాలి. ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్లకుండా ఉండటం మంచిది. షుగర్, బీపీ బాధితులు తమ మందులు సక్రమంగా తీసుకోవాలి. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు బయట తిరగకుండా ఉండాలి. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ముదురు రంగు దుస్తుల బదులు తేలికపాటి లేత రంగు దుస్తులు ధరించాలి. ఆల్కాహాల్ శరీరంలోని నీటి శాతాన్ని తగ్గిస్తుంది. కాబట్టి వేసవిలో మద్యానికి దూరంగా ఉండటం మంచిది. ఓఆర్ఎస్, కొబ్బరి నీళ్లు, ఉప్పు కలిపిన నిమ్మరసం వంటి పానీయాలు శరీరం కోల్పోయిన లవణాలను తిరిగి భర్తీ చేస్తాయి. దోసకాయలు, పుచ్చకాయలు, దానిమ్మ, బత్తాయి వంటి పండ్లు తీసుకోవాలి. వేసవిలో తేలికపాటి వ్యాయామాలు ఉదయం 8 గంటలలోపే పూర్తి చేయాలి. వడదెబ్బ లక్షణాలు కనిపించిన వెంటనే చికిత్స అందించాలి. లేదంటే శరీరం పూర్తిగా నిర్జలీకరణానికి గురై బీపీ, పల్స్ పడిపోయి కొన్నిసార్లు ప్రాణాపాయం సంభవించే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.


# మోదీ ప్రభుత్వం రూ.1,047 లక్షల కోట్ల అప్పు




హైదరాబాద్, నేటిధాత్రి:
ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాపై తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అయితేనే ఏపీకి ప్రత్యేక హోదా వస్తుందని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కోసమైనా రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలని ఏపీ ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఆలోచన చేయాలని.. ఓటు ఎవరికో వేసి దేవుడిని ఏదో అడిగితే ఎవరూ ఏం చేయలేరని అన్నారు. హైదరాబాద్ గాంధీ భవన్‌లో జగ్గారెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీకి ప్రత్యేక హోదా సహా పలు అంశాలపై స్పందించారు.
తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మాట్లాడుతూ.. 'భక్తి అంటే నాది.. నేను రియల్ ఎస్టేట్‌లో సంపాదించిన డబ్బులతో సీతారాముల కల్యాణం చేస్తాను. తెలంగాణలో ఒక్క బీజేపీ నేత అయినా నాలాగా చేస్తారా?. రాములవారి కల్యాణం చేసి నేనెప్పుడైనా ఓట్లు అడిగానా?. ఛత్రపతి శివాజీకి లేని మతం మీకెందుకు?. శివాజీ దగ్గర ముస్లింలు మంత్రులుగా పనిచేశారు. బీజేపీ నేతలు చదువుకోవాలి. ఆ పార్టీ వాళ్లు మాట్లాడితే హిందువులు అంటారు. రాజ్యాంగాన్ని తీసేసే కుట్ర బీజేపీ చేస్తోంది. రాజ్యాంగ పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ పాటుపడుతున్నారు. ఆయన ఎక్కడికి వెళ్లినా ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.
దేశ ప్రజలకు కవచం లాంటిది రాజ్యాంగం. కవచకుండలాలు ఉన్నంతకాలం కర్ణుడిని ఎవరూ చంపలేకపోయారు. అవి దానం చేశాక కర్ణుడి ప్రాణాలు పోయాయి. ఎన్నికల కమిషన్ ద్వారా ఓటు చోరీ చేసి కమలం పార్టీ అధికారంలోకి వచ్చింది. ఓట్లను దొంగిలించి ఎంపీ సీట్లు గెలిచింది. దేవుడి పేరుతో, మతం పేరుతో, దొంగ ఓట్లతో ఆ పార్టీ గెలుస్తోంది. దేశ ప్రజలు ఇప్పటికే ప్రమాదంలో ఉన్నారు. రాజ్యాంగాన్ని తీసేస్తే మరింత ప్రమాదంలో పడతారు. దేశం 67 ఏళ్ల పాలనలో రూ.54 లక్షల కోట్ల అప్పు చేస్తే.. బీజేపీ అధికారంలోకి వచ్చాక రూ.1,047 లక్షల కోట్ల అప్పులు చేసింది.
రాహుల్ కుటుంబం అధికారం కోసం ఏనాడూ తాపత్రయపడలేదు. ఆయనది ఆస్తులు, ప్రాణత్యాగం చేసిన కుటుంబం. ప్రధాని పదవిని రాహుల్ త్యాగం చేశారు. అధికారం చేపట్టిన తర్వాత మోదీ చేసిన మంచి ఒక్కటి చెప్పండి' అని మండిపడ్డారు.

# దేశాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్న ఎండల తీవ్రత

●భానుడి భగభగలతో బయటకు రావాలంటేనే భయపడుతున్న ప్రజలు
●వారం రోజుల పాటు తీవ్ర వడగాలుల హెచ్చరిక ●పలు రాష్ట్రాలకు ఐఎండీ అలర్ట్



న్యూఢిల్లీ, నేటిధాత్రి:
దేశవ్యాప్తంగా భానుడు తన ఉగ్రరూపం చూపిస్తున్నాడు. చాలా ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది గంటల నుంచే ఎండలు భగభగమండుతున్నాయి. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు అడుగు పెట్టాలంటేనే భయపడుతున్నారు. అత్యవసర పనులు ఉంటే తప్ప ఎక్కువ మంది ఇళ్లకే పరిమితం అవుతున్నారు.
రానున్న వారం రోజుల పాటు కూడా దేశంలోని పలు ప్రాంతాల్లో తీవ్రమైన వడగాలులు వీచే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు వాయవ్య, మధ్య, తూర్పు భారతదేశంలోని పలు మైదాన ప్రాంతాల్లో వడగాలులు ప్రభావం చూపే అవకాశముందని అంచనా వేసింది. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, పంజాబ్, హర్యానా, చండీగఢ్, ఢిల్లీ, రాజస్థాన్ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో తీవ్ర వడగాలులు వీచే అవకాశముందని ఐఎండీ వెల్లడించింది.
అదేవిధంగా విదర్భ, ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతం, యానాం, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశా, తెలంగాణ, జమ్మూ కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ ప్రాంతాల్లో కూడా వడగాలుల ప్రభావం కొనసాగనున్నట్లు పేర్కొంది.

### ప్రపంచంలో అత్యంత వేడి నగరాలు భారత్‌లోనే

శుక్రవారం ఉదయం దాదాపు 11 గంటల సమయంలో నమోదైన ఉష్ణోగ్రతల వివరాల ప్రకారం ప్రపంచంలోని అత్యంత వేడిగా నమోదైన 50 నగరాలన్నీ భారత్‌లోనే ఉన్నట్లు ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ గణాంకాలు వెల్లడించాయి.
ఈ జాబితాలోని సగం నగరాలు ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందినవే కావడం గమనార్హం. అలాగే మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, బీహార్, తెలంగాణ, హర్యానా, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లోని పలు ప్రాంతాలు కూడా ఈ జాబితాలో చోటు దక్కించుకున్నాయి.
దేశవ్యాప్తంగా ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అత్యవసర పరిస్థితులు మినహా బయటకు రావొద్దని, తగిన జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.

# సెంట్రింగ్ కార్మికులతో చర్చించి, రెండు రోజుల్లో సమస్యలు పరిష్కరించాలి

హైదరాబాద్ , నేటిధాత్రి:
ఇందిరాపార్క్ వద్ద ధర్నాకు దిగిన సెంట్రింగ్ కార్మికులతో చర్చలు జరిపి వారి సమస్యను రెండు రోజుల్లో పరిష్కరించాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. లేదంటే వారితో పాటు సమస్య పరిష్కారమయ్యే వరకు ఎన్ని రోజులైనా తాను ధర్నాలో కూర్చుంటానని స్పష్టం చేశారు. 12 డిమాండ్లతో ఇందిరాపార్క్ వద్ద ధర్నా చేపట్టిన సెంట్రింగ్ కార్మికులకు కవిత మద్దతు తెలిపారు. ధర్నా శిబిరం వద్దకు వెళ్లి వారికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెంట్రింగ్ కార్మికుల సమస్యలను ఈ ప్రభుత్వం పట్టించుకోవటం లేదని వారిని విస్మరిస్తే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ కు కర్రుకాల్చి వాత పెట్టటం ఖాయమన్నారు. తాము అధికారంలో వచ్చాక సెంట్రింగ్ కార్మికుల అన్ని డిమాండ్లను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గుంపు మేస్త్రీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాలు ఆగమావుతున్నాయని చెప్పారు. అందుకే గుంపు మేస్త్రీ హటావో...తెలంగాణ బచావో అనే నినాదమిస్తున్నానని చెప్పారు.

### రెండు రోజుల్లో సమస్య పరిష్కరించాలి

హైదరాబాద్ నిర్మాణంలో సెంట్రింగ్ కార్మికుల పాత్ర మరవలేదని కవిత అన్నారు. అందుకే వారి అడుగులో అడుగునై వారికి అండగా నిలుస్తానని చెప్పారు. బిల్డింగ్ నిర్మించే కాంట్రాక్ట్ లో సెంట్రింగ్ వాళ్ల పేరుతో అగ్రిమెంట్లు ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈఎస్ఐ కార్డ్, స్క్వేర్ ఫీట్ కు 51 రూపాయల కూలీ, కార్మికుల చనిపోతే పరిహారం పది లక్షల నుంచి 20 లక్షలు ఇవ్వాలని వారు కోరుతున్నారని చెప్పారు. మొత్తం 12 డిమాండ్లతో సెంట్రింగ్ కార్మికులు చేపట్టిన ధర్నా సహేతుకమైనదేనని అన్నారు. వారు గొంతెమ్మ కోరికలు కోరటం లేదని...ప్రభుత్వం దృష్టి పెడితే సమస్యలు తీర్చవచ్చని చెప్పారు. వారితో చర్చించి రెండు రోజుల్లో సమస్య తీర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో అద్దాల మేడలు కనిపిస్తున్నాయంటే దాని వెనుక సట్టంట్రింగ్ కార్మికుల కృషి ఉందని, ప్రాణాలను పణంగా పెట్టి గాలిలో వేలాడుతూ వాళ్లు పనిచేస్తుంటారని చెప్పారు. కానీ వారిని ఈ ప్రభుత్వం పట్టించుకోకపోవటం అన్యాయమన్నారు. 2 లక్షల రూపాయల పనికోసం 15 లక్షల రూపాయల మెటీరియల్ ను తీసుకెళ్లాల్సి ఉంటుందని వాటికి రక్షణ లేని పరిస్థితి ఉందన్నారు. గుంపు మేస్త్రీ సీఎం అయ్యాక హైడ్రా పేరుతో నోటీసులు ఇవ్వకుండానే ఇళ్లను కూల్చేస్తున్నారని చెప్పారు. దాని కారణంగా కూడా సెంట్రింగ్ వాళ్లే నష్టపోతున్నారని వారికి ఇంటి యాజమాని గానీ ప్రభుత్వం గానీ పరిహారం ఇవ్వటం లేదని గుర్తు చేశారు. పది రోజులుగా ధర్నా చేస్తూ కూడా మీతో పాటు ఉండే కార్మికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకుంటున్న మీ మానవత్వానికి చేతులెత్తి నమస్కరిస్తున్నానని సెంట్రింగ్ యాజమాన్యాలను ఉద్దేశించి అభినందించారు.



### మేం వచ్చాక అన్ని డిమాండ్లు పరిష్కరిస్తాం

తెలంగాణ రక్షణ సేన అధికాంలోకి వచ్చాక సెంట్రింగ్ కార్మికులు, యాజమాన్యాలు అడిగిన అన్ని డిమాండ్లను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మీరు అడుగుతున్న వాటిలో ఒక్కటి కూడా గొంతెమ్మ కోరిక లేదని చెప్పారు. హైదరాబాద్ లో 86 చోట్ల వెయ్యి నుంచి రెండు వేల గజాల స్థలం ఇస్తామని అన్నారు. ప్రతి మండలంలో కూడా సెంట్రింగ్ కార్మికుల సంఘాలు ఏర్పాటు కావాల్సిన అవసరముందని చెప్పారు. ప్రభుత్వం ఈ సమస్యను పట్టించుకోకపోతే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కర్రు కాల్చి వాత పెడతారని హెచ్చరించారు.



# యువతకు మంచి భవిష్యత్తు ఇవ్వొద్దా..

హైదరాబాద్, నేటిధాత్రి:
బీఆర్ఎస్ పార్టీ నేతలపై మంత్రి శ్రీధర్ బాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు చీప్ పాలిటిక్స్.. బ్లాక్ మెయిల్ పాలిటిక్స్ చేయొద్దని అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ఎక్కడ అభివృద్ధి చేస్తే అక్కడ ఆపుతామంటే ఎలా అని ప్రశ్నించారు. ప్రజలు కోరుకున్నది తప్పకుండా చేసి తీరుతామన్నారు. వేలాది కోట్లు పెడతామని మల్టీ నేషనల్ కంపెనీలు వస్తున్నాయని.. ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామంటే పెట్టుబడిదారులు భయపడరా అని ఆగ్రహం వ్యక్తం చేశారు.
హైదరాబాద్‌లో కాంగ్రెస్ తెచ్చిన మెట్రోనే ముందుకు సాగిందని మంత్రి తెలిపారు. తాము ఎన్ని కిలోమీటర్లు తెచ్చామో అన్ని కిలోమీటర్లు మాత్రమే మెట్రో వచ్చిందని చెప్పారు. మెట్రోను విస్తరిద్దామంటే అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. పెరిగిన జనాభాకి అనుగుణంగా మెట్రో విస్తరించకూడదా అని ప్రశ్నించారు. మాజీ మంత్రి హరీశ్ రావు పగటి కలలు కంటున్నారని విమర్శించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలా? వద్దా? హరీశ్ రావు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ, పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయిందని.. అయినా ఆ పార్టీ నేతల బుద్ధి మారడం లేదని వ్యాఖ్యానించారు.
నగరాన్ని విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోందని మంత్రి తెలిపారు. ప్రజల అవసరాలను తీర్చడానికి ప్రణాళికలు రూపొందించామన్నారు. ఇతర నగరాల అభివృద్ధిపై అధ్యయనం చేశామన్నారు. రాబోయే తరాలకు ఉపయోగపడే కార్యాచరణ చేపట్టాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడానికే బీఆర్ఎస్ ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని అడ్డుకోవాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని మంత్రి ఆరోపించారు. ఓటమితో ఎదురైన నిరాశ నుంచి ఇప్పటికీ బయటకి రాలేకపోతున్నారన్నారు. బుల్లెట్ ట్రైన్ తెస్తామంటే.. ఎందుకని బీఆర్ఎస్ నేతలు అడ్డుపడుతున్నారని ఫైర్ అయ్యారు. తెలంగాణ యువతకు మంచి భవిష్యత్తు ఇవ్వొద్దా అని అన్నారు. స్వార్థ రాజకీయాలే తమకి ముఖ్యమని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు విరుచుకుపట్టారు.

# యువశక్తితో వికసిత భారత్




హైదరాబాద్, నేటిధాత్రి:
దేశవ్యాప్తంగా 47 ప్రాంతాల్లో జరిగిన రోజ్‌గార్ మేళాలో 51 వేల మందికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. శనివారం నాడు బోయిగూడలోని రైల్ కళారంగ్‌లో జరిగిన 19వ రోజ్‌గార్ మేళాలో కేంద్ర మంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈరోజు 220 మంది కొత్తగా ఉద్యోగాల్లో చేరుతున్నారన్నారు. 2022లో దీపావళి రోజున మొదలైన రోజ్‌గార్ మేళా ద్వారా ఇప్పటివరకు 12.5 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించామని వెల్లడించారు. ఇది కేవలం ఉద్యోగాల కార్యక్రమం కాదని, యువత భవిష్యత్తు కోసం మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన పెద్ద మిషన్ అని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేట్ కంపెనీల్లో కూడా కోట్ల సంఖ్యలో ఉద్యోగాలు వస్తున్నాయని అన్నారు.

### స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా యువతకు శిక్షణ..

స్టార్టప్స్, యూనికార్న్స్ వల్ల యువత ఉద్యోగాలు అడిగే స్థాయి నుంచి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి వచ్చిందని కేంద్రమంత్రి అన్నారు. రోడ్లు, ఎయిర్‌పోర్టులు, రైల్వేలు, మెట్రోలు, ఇండస్ట్రియల్ కారిడార్లు వంటి ప్రాజెక్టులతో భారీగా ఉపాధి పెరుగుతోందన్నారు. దేశంలో ప్రతి సంవత్సరం రూ.12 లక్షల కోట్ల ఇన్‌ఫ్రా పనులు జరుగుతున్నాయని వివరించారు. ప్రతి లక్ష కోట్ల పెట్టుబడికి 14 నుంచి 15 లక్షల ఉద్యోగాలు వస్తున్నాయన్నారు. యువతను మోదీ 'వికసిత భారతానికి సూపర్ హీరోలు'గా చూస్తున్నారని అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా కోట్ల మంది యువతకు శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. గ్రామీణ యువతకు కూడా AI, వంటి ఆధునిక టెక్నాలజీని మాతృభాషలో నేర్పిస్తున్నామని తెలిపారు.

### అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్...

భారత యువత ప్రపంచస్థాయిలో రాణిస్తోందని కిషన్ రెడ్డి అన్నారు. సెమీకండక్టర్లు, స్పేస్, డ్రోన్ టెక్నాలజీలో భారత్ ముందుకు వెళ్తోందన్నారు. చంద్రుడి దక్షిణ ధృవానికి ముందుగా చేరిన దేశం భారత్ అని చెప్పుకొచ్చారు. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో స్వదేశీ డ్రోన్లు శత్రు క్షిపణులను అడ్డుకున్నాయని అన్నారు. 2047 నాటికి వికసిత భారత్ లక్ష్య సాధనలో యువత పాత్ర కీలకమన్నారు. యూనివర్సిటీలు, కాలేజీలు, పీఎం-శ్రీ స్కూల్స్ సంఖ్య పెంచామని తెలిపారు. భారత్ ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని అన్నారు. 2014కు ముందు వందల స్టార్టప్స్ మాత్రమే ఉండగా, ఇప్పుడు 1.2 లక్షలకు పైగా ఉన్నాయన్నారు. మైనింగ్, బొగ్గు రంగాల్లో కూడా మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని యువతకు సూచించారు. మైనింగ్, ఇంజనీరింగ్ వంటి కోర్సులపై యువత దృష్టి సారించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సూచనలు చేశారు.

Printed, Published & owned by Katta Raghavender Rao, Printed at S.V. Offset Printers, H. No. 4-6-65, S.T. Josephes High School,Kumarpalli Hanamkond, Warangal-01. Telangana State. & Published from, H.No.4-6-65, Opp. S.T. Josephes High School,kumarpalli, Hanamkonda, Warangal -506001. Telangana State.
Editor : Katta Raghavender Rao, RNI No. APTEL / 2005/15537. E-mail : netidhatrisv@gmail.com Cell : 9908658888, 8297779999